VELTHURU TELUGU DAILAY

# వెలుతురు

## తెలుగు దిన పత్రిక

హైదరాబాద్
బుధవారం 06.05.2026

సంపుటి: 07 సంచిక: 333
పేజీలు: 12 వెల: రూ. 5/

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA I ANDHRA PRADESH

Velthuru Newspaper



## నైపుణ్యాల పెంపుతోనే ఉద్యోగావకాశాలు

2

ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్

హైదరాబాద్‌లో రాష్ట్ర భవిష్యత్ ప్రణాళికపై కీలక సమావేశం

# ఓపెన్ జిమ్ లను ఏర్పాటు చేసిన "మలయప్ప ఫౌండేషన్"

- ఓపెన్ జిమ్ లను ప్రారంభించిన కేంద్ర మంత్రి బండి సంజయ్
- నాల్కో సౌజన్యం తో జిమ్ లను ఏర్పాటు చేసిన " మలయప్ప ఫౌండేషన్ "
- రూ.కోటి సీఎస్ఆర్ నిధులతో ఓపెన్ జిమ్ ల ఏర్పాటు
- దుర్శేడు, కిసాన్ నగర్ లో ప్రారంభించిన కేంద్ర మంత్రి బండి సంజయ్







కరీంనగర్ వెలుతురు మే 05:

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ''ఫిట్ ఇండియా' నినాదాన్ని పురష్కరించుకుని కరీంనగర్ ప్రజలకు ఓపెన్ జిమ్ లు అందుబాటులోకి వచ్చాయి. దాదాపు కోటి రూపాయల వ్యయంతో 17 డివిజన్లలో ఓపెన్ జిమ్ లను ఏర్పాటవుతున్నాయి. నాల్కో సంస్థ అందిస్తున్న సీఎస్సార్ నిధుల సహకారంతో మలయప్ప ఫౌండేషన్ నిర్వాహకులు ఈ ఓపెన్ జిమ్ లను ఏర్పాటు చేస్తున్నరు. అందులో భాగంగా మంగళవారం రోజున నగరంలోని కిసాన్ నగర్ అంబేద్కర్ యూత్ క్లబ్ సమీపంలో, దుర్శేడులో నూతనంగా ఏర్పాటు చేసిన రెండు ఓపెన్ జిమ్ లను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రారంభించారు. కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జె.సంగప్ప, స్థానిక కార్పొరేటర్లతో కలిసి ఆయా ఓపెన్ జిమ్ లను కేంద్ర మంత్రి ప్రారంభించారు. కేంద్ర మంత్రి సహకారంతో పూర్తిగా ప్రైవేట్ సంస్థలు అందిస్తున్న సీఎస్సార్ నిధులతోనే ఓపెన్ జిమ్ లను ఏర్పాటు చేసినట్లు మలయప్ప ఫౌండేషన్ డైరెక్టర్లు డాక్టర్ గడ్డం అరుణ్ జయ్, గడ్డం అనూష తెలిపారు. నిత్యం ఉరుకులు పరుగులతో ఉద్యోగాల్లో బిజీగా ఉంటూ శారీరక ఫిట్ నెస్ ను కోల్పోతున్న వారికి ఈ ఓపెన్ జిమ్ లు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. కరీంనగరలో మొత్తం 17 డివిజన్లలో వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. కరీంనగర్ ప్రజలంతా ఈ ఓపెన్ జిమ్ లను ఉపయోగించుకుని శారీరక ధ్రుఢత్వాన్ని పెంచుకోవాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ సూచించారు.



## మోదీ పర్యటన కు పకడ్బందీ బందోబస్తు

- హైదరాబాద్ రానున్న ప్రధాని పర్యటనపై ఉన్నతస్థాయి సమీక్ష
- అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని సీఎస్ ఆదేశాలు
- భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచనలు
- ట్రాఫిక్ నియంత్రణకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశం
- కాన్వాయ్ మార్గాల్లో రోడ్ల స్థితిగతుల పరిశీలనకు ఆదేశాలు
- అవసరమైన చోట వెంటనే మరమ్మతులు పూర్తి చేయాలని జీహెచ్ఎంసీకి సూచనలు

2



## ఇతర రాష్ట్రాల్లో గెలిస్తే ఇక్కడ సంబురాలా?

- సొంత పార్టీ నేతలపై రాజాసింగ్ అసంతృప్తి
- బీజేపీ రాష్ట్ర నేతల పనితీరుపై గోషామహల్ ఎమ్మెల్యే అసంతృప్తి
- అస్సాం, పుదుచ్చేరి, బెంగాల్ విజయాలపై విమర్శలు
- తెలంగాణలో అధికారంలోకి రావడంపై స్పష్టత కోరిన రాజాసింగ్
- స్థానిక రాజకీయాలపై దృష్టి పెట్టాలని సూచన

2



## పంట మార్పిడిపై ప్రభుత్వం ఫోకస్

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో రైతు కమిషన్ కీలక భేటీ

- జూబ్లీ హిల్స్ నివాసంలో జరిగిన సమావేశంలో నివేదిక
- పంట మార్పిడి విధానంపై సమగ్ర చర్చ అవసరమన్న సీఎం
- అసెంబ్లీలో ప్రత్యేక చర్చ నిర్వహిస్తామని సభ్యులకు హామీ
- వ్యవసాయంలో మార్పులకు నిపుణుల సూచనలు తీసుకోవాలన్న రేవంత్
- పంటల వైవిధ్యంపై శాస్త్రీయ దృష్టితో ముందుకు వెళ్లాలని సూచన
- రైతుల ఆదాయ వృద్ధికి పంట మార్పిడి కీలకమని అభిప్రాయం
- రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, మంత్రి వాకిటి శ్రీహరి హాజరు

హైదరాబాద్ వెలుతురు మే 05:

తెలంగాణలో వ్యవసాయ రంగాన్ని స్థిరంగా అభివృద్ధి చేసే దిశగా పంట మార్పిడి (క్రాప్ రోటేషన్) విధానంపై ప్రభుత్వం మరింత దృష్టి సారిస్తోంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి జూబ్లీ హిల్స్‌లోని తన నివాసంలో రైతు కమిషన్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ భేటీలో రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, కమిషన్ సభ్యులు పాల్గొని పంట మార్పిడి అంశంపై సమగ్ర నివేదికను ముఖ్యమంత్రికి అందజేశారు. మంత్రి వాకిటి శ్రీహరి కూడా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పంట మార్పిడి వ్యవస్థను రాష్ట్రంలో విస్తృతంగా అమలు చేయాల్సిన అవసరాన్ని కమిషన్ ప్రతినిధులు వివరించారు. నేల ఆరోగ్యాన్ని కాపాడటం, దిగుబడులను పెంచడం, నీటి వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించడం వంటి అంశాల్లో పంట మార్పిడి కీలక పాత్ర పోషిస్తుందని వారు నివేదికలో పేర్కొన్నారు. ముఖ్యంగా ఒకే పంటను వరుసగా పండించడం వల్ల నేలలో పోషకాలు తగ్గిపోవడం, వ్యాధులు పెరగడం వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని సూచించారు. ఈ నివేదికపై స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పంట మార్పిడి అంశం రైతుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న కీలక అంశమని పేర్కొన్నారు. ఈ విషయంపై ప్రభుత్వం సమగ్ర చర్చ జరపాలని భావిస్తున్నట్లు

..మిగతా 2లో





## మోడీ జీ.. కాళేశ్వరం విచారణ ఎప్పుడు చేస్తారు?

- బీజేపీ నేతలు క్లారిటీ ఇవ్వాలి : పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్
- సీబీఐ విచారణపై బీజేపీ ద్వంద్వ వైఖరి అంటూ ఆరోపణలు
- కేసీఆర్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు
- బీజేపీబీఆర్ఎస్ మధ్య అవగాహన ఉందా ? అంటూ అనుమానం
- రాష్ట్రంలో కాంగ్రెస్ రైతు సంక్షేమం కోసం ఎంతో చేస్తోంది
- బెంగాల్ ఎన్నికల ఫలితాలపై సంచలన ఆరోపణలు
- ప్రజలు ఓటు హక్కును కాపాడుకోవాలని పిలుపు

2


## మే 9న బెంగాల్‌లో కొత్త ప్రభుత్వం

2

- ప్రభుత్వం ఏర్పాటుకు బీజేపీ సన్నాహాలు
- ఠాగూర్ జయంతి రోజున కొత్త సీఎం ప్రమాణ స్వీకారం లక్ష్యం
- రాష్ట్ర అధ్యక్షుడు సమీక్ భట్టాచార్య కీలక ప్రకటన







2

## మొక్కజొన్న కొనుగోళ్లతో పాటు జొన్న కూడా కొనుగోలు చేయాలని సబ్ కమిటీ నిర్ణయం

- సబ్ కమిటీ నిర్ణయాన్ని ప్రకటించిన

## మొక్కజొన్న కొనుగోళ్లతో పాటు జొన్న కూడా కొనుగోలు చేయాలని సబ్ కమిటీ నిర్ణయం



హైదరాబాద్ వెలుతురు మే 05:

రాష్ట్రంలోని రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, మొక్కజొన్న పంటతో పాటు జొన్న పంటను కూడా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రాష్ట్ర కేబినెట్ సబ్ కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ రోజు నిర్వహించిన సబ్ కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని తీసుకున్న ఈ నిర్ణయం వారికి పెద్ద ఊరటనిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ నిర్ణయానికి రాష్ట్ర ముఖ్యమంత్రి మరియు సబ్ కమిటీ సభ్యులకు రాష్ట్ర రైతుల తరపున మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. మొక్కజొన్న మరియు జొన్న పంటలను పరిధిలోకి తీసుకుని కేంద్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు కోరినప్పటికీ, ఇప్పటివరకు కేంద్రం ఎలాంటి స్పందన ఇవ్వకుండా... నిమ్మకు నీరెత్తనట్టుగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. దేశంలోని ఏ ఇతర రాష్ట్రాల్లో ఎక్కడా మొక్కజొన్న, జొన్న పంటలను రాష్ట్ర ప్రభుత్వాలు కొనుగోలు చేయడం లేదని, అక్కడి రైతులు బహిరంగ మార్కెట్లో లభించిన ధరలకే తమ పంటను అమ్ముకుంటున్నారని మంత్రి తెలిపారు. అయితే తెలంగాణలో మాత్రం రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ముందుకు వచ్చి పంటలను కొనుగోలు చేస్తోందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే యాసంగి సీజన్‌లో 278 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి సుమారు 5.50 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను సేకరించినట్లు మంత్రి వెల్లడించారు. మార్కెట్లో గిట్టుబాటు ధరలు లభించకపోవడంతో రైతులకు నష్టం కలగకుండా కనీస మద్దతు ధర (MSP) వద్ద కొనుగోళ్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత ఖరీఫ్ సీజన్‌లో కూడా రాష్ట్ర ప్రభుత్వం సుమారు 3.76 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను కొనుగోలు చేసి రూ.902.80 కోట్ల వ్యయం భరించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుతం రైతులు తమ జొన్న పంటను మార్కెట్లకు తీసుకురావడం ప్రారంభించిన నేపథ్యంలో, మార్కెట్లో గిట్టుబాటు ధరలు లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి తెలిపారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, మొక్కజొన్న తరహాలోనే జొన్న పంటను కూడా రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సబ్ కమిటీ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఈ నిర్ణయం వల్ల జొన్న రైతులకు గణనీయమైన ఆర్థిక భరోసా లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత రబీ సీజన్‌లో రాష్ట్రంలో మొక్కజొన్న పంటను సుమారు 11.21 లక్షల ఎకరాలలో సాగు చేయగా, అనుకూల వాతావరణ పరిస్థితులతో ఎకరానికి సగటు 26.57 క్వింటాళ్ల దిగుబడి వచ్చినట్లు మంత్రి తెలిపారు. అలాగే జొన్న పంటను 3.68 లక్షల ఎకరాలలో సాగు చేయగా, ఎకరానికి సరాసరి క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేసినట్లు చెప్పారు. ఈ ఒక్క సంవత్సరంలోనే రాష్ట్ర ప్రభుత్వం వివిధ పంటల కొనుగోళ్ల కోసం దాదాపు రూ.6000 కోట్ల వరకు వ్యయం చేసినట్లు మంత్రి తెలిపారు. రైతుల ఆదాయ భద్రత కోసం ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. కేంద్రం నుండి సహకారం లేకపోయినా రైతులను కష్టాల్లో వదిలేయకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చి కొనుగోళ్లు నిర్వహించడం జరుగుతోందని మంత్రి స్పష్టం చేశారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, ఈ నిర్ణయం రైతులకు మరింత భరోసా కల్పిస్తుందని తెలిపారు. సబ్ కమిటీ తీసుకున్న ఈ నిర్ణయం రాష్ట్రంలోని జొన్న రైతులకు పెద్ద ఊరటనిస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతుల ఆదాయ భద్రతకు ఇది కీలకమైన అడుగుగా నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## మోదీ పర్యటన కు పకడ్బందీ బందోబస్తు

హైదరాబాద్ వెలుతురు మే 05:

హైదరాబాద్‌కు ఈనెల 10న రానున్న ప్రధానమంత్రి మోదీ పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు ప్రారంభించింది. ఈ నేపథ్యంలో సీఎస్ రామకృష్ణారావు సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రధాని పర్యటన సందర్భంగా భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సీఎస్ స్పష్టం చేశారు. ముఖ్యంగా కాన్వాయ్ కదలికలు జరిగే మార్గాల్లో పోలీసు బలగాలను సమర్థంగా మోహరించాలని, ఎలాంటి లోపాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రత్యామ్నాయ మార్గాలను గుర్తించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కాన్వాయ్ వెళ్లే రహదారులను సమగ్రంగా పరిశీలించి, ఎక్కడైనా గుంతలు లేదా దెబ్బతిన్న భాగాలు ఉంటే వెంటనే మరమ్మతులు పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ, ఆర్అండ్‌బీ అధికారులకు సూచించారు. పర్యటన జరిగే ప్రాంతాల్లో పరిశుభ్రత, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు. అగ్నిమాపక శాఖ, వైద్యారోగ్య శాఖలు పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సీఎస్ ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా అంబులెన్సులు, ఫైర్ సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని చెప్పారు. అదే విధంగా విద్యుత్ శాఖ నిరంతరాయ సరఫరా కల్పించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని సూచించారు. అన్ని శాఖలు పరస్పరం సమన్వయంతో పని చేస్తేనే ప్రధాని పర్యటన విజయవంతంగా నిర్వహించగలమని సీఎస్ రామకృష్ణారావు పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో డీజీపీ సీవీ ఆనంద్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొని తమ శాఖల చర్యలపై వివరాలు వెల్లడించారు.



# నైపుణ్యాల పెంపుతోనే ఉద్యోగావకాశాలు

హైదరాబాద్ వెలుతురు మే 05:

హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ భవిష్యత్ ప్రణాళికపై కీలక సమావేశంలో ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ నివాసంలో నిర్వహించిన ఈ సమావేశంలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన విభిన్న అంశాలపై చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా రఘురామ్ రాజన్ మాట్లాడుతూ, నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటే అనేక రంగాల్లో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని స్పష్టం చేశారు. యువతలో నైపుణ్యాల పెంపు అత్యంత అవసరమని, ఇందుకు విద్యా వ్యవస్థలో సమగ్ర మార్పులు అవసరమని సూచించారు. మానవ వనరుల అభివృద్ధికి పోషకాహార లోపం ఒక ప్రధాన అడ్డంకిగా మారుతోందని, దాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. సులభతర వ్యాపార విధానం ఆధారంగా కొత్తపరిశ్రమలు, పెట్టుబడులు రాష్ట్రానికి వస్తాయని రఘురామ్ రాజన్ అభిప్రాయపడ్డారు. అయితే స్టార్టప్‌లకు మరింత ప్రోత్సాహం కల్పిస్తే ఆర్థిక వృద్ధికి మేలు జరుగుతుందని సూచించారు. సరైన విధంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను వినియోగిస్తే అన్ని రంగాలకు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, పాఠశాల, ఉన్నత, సాంకేతిక, వైద్య విద్యల్లో ఏఐ వినియోగంపై కమిటీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని రఘురామ్ రాజన్‌ను కోరారు. మిడిల్ లెవల్ ఉద్యోగాల కల్పన కోసం స్కిల్స్ యూనివర్సిటీలు, అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లను అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు కావాల్సిన అన్ని సౌకర్యాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. భూమి, మౌలిక సదుపాయాలు, విద్యుత్ వంటి అంశాల్లో ప్రభుత్వం ముందుగానే ప్రణాళికలు రూపొందించిందన్నారు. అంతర్జాతీయ విమానాశ్రయం, అవుటర్ రింగ్ రోడ్ వంటి మౌలిక వసతులతో పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఉన్నదని వివరించారు. రాబోయే రోజుల్లో రీజనల్ రింగ్ రోడ్లు, రేడియల్ రోడ్లు, పరిశ్రమల కోసం ప్రత్యేక క్లస్టర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. శాంతిభద్రతలను పటిష్టంగా నిర్వహిస్తున్నామని, రాష్ట్రాన్ని మూడు భాగాలుగా విభజించి అభివృద్ధిపై దృష్టి సారిస్తున్నామని చెప్పారు. 'క్యూర్, ప్యూర్, రేర్' మోడల్ ద్వారా సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు వెల్లడించారు. యువతలో నైపుణ్యాల పెంపు కోసం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసినట్లు, ఐటీఐలను ఎటీసీలుగా మార్చి ప్రాయోగిక శిక్షణ అందిస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, తెలంగాణలో సులభతర వ్యాపారానికి అనుకూల వాతావరణం ఉందన్నారు. ఫార్మా, ఐటీ, డేటా సెంటర్ల అభివృద్ధికి అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నట్లు వివరించారు. డేటా సెంటర్ల ఏర్పాటు విషయంలో విద్యుత్, నీటి వినియోగంపై ప్రత్యేక దృష్టి అవసరమని రఘురామ్ రాజన్ సూచించారు. తమిళనాడు తరహా పారిశ్రామిక విధానం ఉంటే మరిన్ని పెట్టుబడులను ఆకర్షించవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేష్ రంజన్, వాణీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. రఘురామ్ రాజన్ మూడు నాలుగు నెలల్లో హైదరాబాద్‌కు ప్రత్యక్షంగా పర్యటించనున్నట్లు తెలిపారు. మొత్తంగా ఈ సమావేశం తెలంగాణ భవిష్యత్ ఆర్థిక, పారిశ్రామిక దిశను నిర్ణయించే కీలక చర్చగా నిలిచింది.

## మోడీ జీ.. కాళేశ్వరం విచారణ ఎప్పుడు చేస్తారు?

హైదరాబాద్ వెలుతురు మే 05:

హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ బీజేపీ మరియు కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈనెల 10వ తేదీన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హైదరాబాద్‌కు రానున్న నేపథ్యంలో, కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై సీబీఐ విచారణ చేపడతారా లేదా అనే అంశంపై కేంద్రం ముందుగానే స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో వేల కోట్ల రూపాయల అవినీతి జరిగిందని తమ పార్టీ గతంలోనే ఆరోపించిందని, ఈ మేరకు సీబీఐ విచారణ కోరుతూ లేఖ కూడా రాసినట్లు తెలిపారు. అయినప్పటికీ ఇప్పటివరకు దర్యాప్తు ప్రారంభం కాకపోవడంపై ఆయన అనుమానం వ్యక్తం చేశారు. బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉన్నప్పటికీ, ఎందుకు సీబీఐ విచారణ చేపట్టడం లేదని ప్రశ్నించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ పై మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర విమర్శలు చేశారు. ఆయన తన బాధ్యతలను మర్చిపోయి రాజకీయ వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో సీబీఐ విచారణ ఎందుకు జరగడం లేదో బండి సంజయ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు బీజేపీ నేతలే కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అవినీతి జరిగిందని ఆరోపించారని, ఇప్పుడు అదే విషయంపై మౌనం పాటించడం ఎందుకని ప్రశ్నించారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. ఈ నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై కూడా ప్రశ్నలు లేవనెత్తారు. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య అంతర్గత అవగాహన ఉందనే అనుమానాలను ఆయన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతల మద్దతు లేకుండా బీజేపీకి రాష్ట్రంలో ఎనిమిది లోక్‌సభ స్థానాలు వచ్చేవా అని ప్రశ్నించారు. అలాగే హరీష్ రావు మద్దతు లేకుండా మెదక్‌లో బీజేపీ అభ్యర్థి గెలిచేవారా అని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో కాళేశ్వరం అంశంపై సీబీఐ విచారణ చేపట్టకపోవడం వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయనే సందేహం వ్యక్తం చేశారు. రైతు అంశాలపై కూడా మహేష్ కుమార్ గౌడ్ స్పందించారు. గతంలో "వరి వేస్తే ఉరి" అన్నది బీజేపీ నాయకులేనని, ఇప్పుడు రైతుల కోసం కంటతడి పెట్టడం రాజకీయ నాటకమని విమర్శించారు. తమ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ, రైతుబంధు, బోనస్ వంటి పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. మక్కలు కొనుగోలు చేయడం ద్వారా కూడా రైతులకు మద్దతు ఇస్తున్నామని పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాలపై కూడా ఆయన సంచలన ఆరోపణలు చేశారు. అక్కడ బీజేపీకి అనుకూల పరిస్థితులు లేవని, ఓటు చోరీ ద్వారా గెలిచిందని ఆరోపించారు. దాదాపు 90 లక్షల ఓట్లను తొలగించారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తమ ఓటు హక్కును కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఇతర రాష్ట్రాల్లో ప్రతిపక్ష నేతలపై కేసులు నమోదు చేస్తోందని, అయితే అదే సమయంలో తెలంగాణలో కేసీఆర్‌పై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. మమతా బెనర్జీ, అర్వింద్ కేజ్రీవాల్ లపై కేసులు పెట్టిన కేంద్రం, కేసీఆర్ విషయంలో ఎందుకు మౌనం పాటిస్తోందని నిలదీశారు. మొత్తంగా, బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉన్నందున తలచుకుంటే వెంటనే సీబీఐ విచారణ చేపట్టగలదని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. కానీ ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడం వెనుక రాజకీయ లాభనష్టాలే కారణమని ఆరోపించారు. ఈ అంశంపై కేంద్రం స్పష్టమైన సమాధానం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

## పంట మార్పిడిపై ప్రభుత్వం ఫోకస్

**మొదటి పేజీ తరువాయి)**

వెల్లడించారు. వ్యవసాయ రంగంలో సుస్థిరత సాధించాలంటే శాస్త్రీయ పద్ధతులు అనుసరించడం తప్పనిసరి అని అన్నారు. పంట మార్పిడి విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయడానికి ముందు విస్తృత స్థాయిలో చర్చలు జరగాలని సీఎం సూచించారు. ఇందులో రైతులు, వ్యవసాయ నిపుణులు, శాస్త్రవేత్తలు, విధాన నిర్ణేతలు అందరూ పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీలో ప్రత్యేక చర్చను కూడా ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. పంట మార్పిడి వల్ల కలిగే ప్రయోజనాలు, ఎదురయ్యే సవాళ్లు, రైతులకు అవసరమైన మద్దతు వ్యవస్థ వంటి అంశాలపై శాసనసభలో సమగ్రంగా చర్చించనున్నట్లు వెల్లడించారు.

అదేవిధంగా రైతు కమిషన్‌కు మరింత అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. వివిధ ప్రాంతాల్లో వాతావరణ పరిస్థితులు, నేల లక్షణాలు, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని ప్రాంతాల వారీగా పంటల ఎంపికపై సూచనలు ఇవ్వాలని కోరారు. నిర్మాణాత్మక సూచనలతో ప్రభుత్వం ముందుకు సాగేందుకు సహకరించాలని అన్నారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, పంట మార్పిడి ద్వారా రైతుల ఆదాయం పెరిగే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వం ఇప్పటికే రైతులకు అనేక ప్రోత్సాహకాలు అందిస్తున్న నేపథ్యంలో, పంటల వైవిధ్యం పెంపు ద్వారా మరింత లాభదాయక వ్యవసాయం సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి మాట్లాడుతూ, పంట మార్పిడి వ్యవస్థను శాస్త్రీయంగా అమలు చేస్తే రైతుల ఖర్చులు తగ్గడంతో పాటు దిగుబడులు పెరుగుతాయని తెలిపారు. దీనికి సంబంధించి కమిషన్ విస్తృతంగా అధ్యయనం చేసి నివేదికను సిద్ధం చేసినట్లు చెప్పారు. పంట మార్పిడి ద్వారా నేలలో పోషకాలు సమతుల్యంగా ఉండటమే కాకుండా, కీటకనాశక మందుల వినియోగం కూడా తగ్గే అవకాశముందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దీని వల్ల రైతుల ఆరోగ్యం, పర్యావరణం రెండింటికీ మేలు జరుగుతుందని పేర్కొంటున్నారు. మొత్తంగా ఈ సమావేశం రాష్ట్ర వ్యవసాయ విధానాల్లో కీలక మార్పులకు దారితీసే అవకాశంగా భావిస్తున్నారు. రైతుల ఆదాయాన్ని పెంచడం, వ్యవసాయాన్ని సుస్థిరంగా మార్చడం లక్ష్యంగా ప్రభుత్వం పంట మార్పిడి విధానంపై తీసుకునే నిర్ణయాలు భవిష్యత్తులో ప్రభావం చూపనున్నాయి.



## ఇతర రాష్ట్రాల్లో గెలిస్తే ఇక్కడ సంబురాలా?

హైదరాబాద్ వెలుతురు మే 05:

తెలంగాణ రాజకీయాల్లో మరోసారి చర్చనీయాంశంగా మారిన వ్యాఖ్యలు గోషామహల్ ఎమ్మెల్యే టి రాజాసింగ్ నుంచి వచ్చాయి. ఇతర రాష్ట్రాల్లో సాధించిన విజయాలపై రాష్ట్రంలో సంబరాలు చేసుకోవడంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ బీజేపీ రాష్ట్ర నేతలను నేరుగా ప్రశ్నించారు. పార్టీకి చెందిన కొంతమంది నాయకులు అసోం, పుదుచ్చేరి, బెంగాల్ వంటి రాష్ట్రాల్లో గెలిచిన విజయాలను ఇక్కడ ప్రదర్శిస్తూ సంబరాలు చేసుకోవడం వల్ల తెలంగాణలో పార్టీకి ఎలాంటి లాభం కలుగుతుందనే అంశాన్ని ఆయన లేవనెత్తారు. ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణలో పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉన్నప్పటికీ, ఇతర రాష్ట్రాల విజయాలకే పరిమితమై సంబరాలు చేసుకోవడం సరైన వ్యూహం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా స్థానిక సమస్యలు, ప్రజల ఆకాంక్షలు, ప్రాంతీయ రాజకీయ సమీకరణాలను పరిగణనలోకి తీసుకోకుండా బయట రాష్ట్రాల ఫలితాలను ప్రచారం చేయడం వల్ల పార్టీకి ఇక్కడ ప్రాధాన్యం పెరగదని రాజాసింగ్ స్పష్టం చేశారు. అస్సాం, పుదుచ్చేరి, బెంగాల్ రాష్ట్రాల్లో బీజేపీ లేదా మిత్రపక్షాలు సాధించిన విజయాలను ఉదాహరణగా చూపిస్తూ తెలంగాణలో కూడా అదే తరహా విజయాలు సాధిస్తామని చెప్పడం వాస్తవానికి దూరమని ఆయన వ్యాఖ్యానించారు. ఆ రాష్ట్రాల రాజకీయ పరిస్థితులు, స్థానిక అంశాలు, ఓటర్ల అభిరుచులు పూర్తిగా భిన్నంగా ఉంటాయని పేర్కొన్నారు. అందువల్ల అక్కడి ఫలితాలను ఇక్కడికి అన్వయించుకోవడం సాధ్యంకాదని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణలో అధికారంలోకి రావాలంటే పార్టీ స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని రాజాసింగ్ సూచించారు. పార్టీ శ్రేణులు ప్రజల్లోకి వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవాలని, స్థానిక స్థాయిలో బలమైన నిర్మాణాన్ని ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు. కేవలం ఇతర రాష్ట్రాల విజయాలను చూపిస్తూ ప్రజలను ఆకట్టుకోవడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. ఇంకా ఎన్నాళ్లు ఇతర రాష్ట్రాల్లో గెలిచామని చెప్పుకుంటూ ఇక్కడ సంబరాలు చేసుకుంటారని ఆయన ప్రశ్నించారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి ఎప్పుడు వస్తుందనే ప్రశ్నకు పార్టీ నాయకత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ దిశగా పార్టీ లోపల సమీక్ష జరగాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. రాజాసింగ్ వ్యాఖ్యలు పార్టీ కార్యకర్తల్లో చర్చకు దారి తీశాయి. కొంతమంది కార్యకర్తలు ఆయన అభిప్రాయాలకు మద్దతు తెలుపుతుండగా, మరికొందరు ఈ వ్యాఖ్యలను అంతర్గత విమర్శలుగా భావిస్తున్నారు. అయినప్పటికీ ఈ వ్యాఖ్యలు పార్టీ భవిష్యత్ వ్యూహాలపై ఆలోచనకు దారితీస్తున్నాయి. తెలంగాణలో బీజేపీ స్థితిగతులపై కూడా ఆయన వ్యాఖ్యలు కీలకంగా మారాయి. గత కొన్ని సంవత్సరాలుగా పార్టీ రాష్ట్రంలో బలోపేతం కావడానికి ప్రయత్నిస్తున్నప్పటికీ, అధికారంలోకి రావడానికి అవసరమైన స్థాయిలో ఎదగలేదనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో ఉంది. ఈ నేపథ్యంలో రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు పార్టీ లోపలి పరిస్థితులను ప్రతిబింబిస్తున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. పార్టీ రాష్ట్ర నాయకత్వం స్థానిక రాజకీయాలపై మరింత దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. ప్రజల సమస్యలను అర్థం చేసుకుని, వాటికి పరిష్కార మార్గాలను చూపగలిగితేనే ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని అన్నారు. ఈ దిశగా సమగ్ర వ్యూహంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఇతర రాష్ట్రాల విజయాలు ప్రేరణగా ఉపయోగపడతాయే కానీ వాటిపై ఆధారపడి స్థానిక రాజకీయాల్లో విజయం సాధించడం కష్టం అని రాజాసింగ్ పేర్కొన్నారు. తెలంగాణలో ప్రత్యేక పరిస్థితులు ఉన్నాయని, వాటిని దృష్టిలో ఉంచుకుని కార్యాచరణ రూపొందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. మొత్తంగా రాజాసింగ్ చేసిన ఈ వ్యాఖ్యలు బీజేపీ రాష్ట్ర రాజకీయాల్లో కీలక చర్చకు దారి తీసాయి. పార్టీ భవిష్యత్ దిశ, వ్యూహాలపై పునరాలోచన అవసరమనే సంకేతాలను ఇవి ఇస్తున్నాయి. తెలంగాణలో అధికార లక్ష్యాన్ని సాధించాలంటే కేవలం ఇతర రాష్ట్రాల విజయాలను ప్రస్తావించడం కాకుండా, స్థానిక స్థాయిలో బలమైన పునాదులు ఏర్పరచుకోవాలని ఆయన సందేశం స్పష్టంగా వెల్లడవుతోంది.

# మే 9న బెంగాల్‌లో కొత్త ప్రభుత్వం




పశ్చిమ బెంగాల్ వెలుతురు మే 05:

పశ్చిమ బెంగాల్‌లో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు దిశగా బీజేపీ కసరత్తులు ప్రారంభించింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు శ్యామిక్ భట్టాచార్య కీలక వ్యాఖ్యలు చేశారు. మే 9న నోబెల్ పురస్కార గ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి సందర్భంగా కొత్త ప్రభుత్వ ప్రమాణ స్వీకారం నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఆ రోజునే కొత్త ముఖ్యమంత్రి ప్రమాణం చేయడం ద్వారా రాష్ట్రంలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుడతామని పేర్కొన్నారు.

అయితే, ముఖ్యమంత్రి పదవిని ఎవరు చేపడతారన్న అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. పార్టీ లోపల చర్చలు కొనసాగుతున్నట్లు సమాచారం. మరోవైపు ఎన్నికల ఫలితాల అధికారిక ప్రక్రియ కూడా వేగవంతమవుతోంది. ఎన్నికల సంఘం అధికారులు గెజిట్ నోటిఫికేషన్‌ను రాష్ట్రప్రధాన ఎన్నికల అధికారికి అందజేయనున్నారు. తదుపరి దశలో ఆ పత్రాలను గవర్నర్ ఆర్ ఎన్ రవికి సమర్పించనున్నారు. అనంతరం ప్రస్తుత ముఖ్యమంత్రి మమతా బెనర్జీను రాజీనామా చేయాలని ఆహ్వానించే అవకాశం ఉంది. కొత్త ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసే వరకు ఆమె ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగుతారు. ఇదిలా ఉండగా, అసన్‌సోల్ ప్రాంతంలో సామాజిక ఉద్రిక్తతల కారణంగా కొన్నేళ్లుగా మూసివేసిన దుర్గాదేవి ఆలయం తాజాగా తిరిగి తెరుచుకుంది. ఈ ఆలయాన్ని తిరిగి ప్రారంభిస్తానని హామీ ఇచ్చిన బీజేపీ ఎమ్మెల్యే కృష్ణేందు ముఖర్జీ తన వాగ్దానాన్ని నెరవేర్చారు. ఎన్నికల్లో విజయం సాధించిన వెంటనే ఆలయాన్ని సందర్శించి పునఃప్రారంభించారు. ఈ పరిణామాలన్నీ కలిపి బెంగాల్ రాజకీయాల్లో కొత్త మలుపుకు సంకేతాలుగా మారుతున్నాయి.

# కాళేశ్వరం అవినీతి పై సిబిఐ మౌనం బీజేపీబీఆర్ఎస్ లాలూచికి నిదర్శనం : మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి









హైదరాబాద్ హన్మకొండ వెలుతురు మే 05:

కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి పై కమీషన్ విచారణ జరిపి అవినీతి జరిగిందని, ప్రజా ధనం దుర్వినియోగం జరిగిందని నివేదికను కేంద్ర దర్యాప్తు సంస్థ సిబిఐ కి అప్పగించి తొమ్మిది నెలలు గడిచినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బీజేపి-బీఆర్ఎస్ మధ్య లాలూచి రాజకీయాలకు నిదర్శనమని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి విమర్శించారు.

ఇద్దరు కేంద్ర మంత్రులు, బీజేపి ఎంపీలు చిత్తశుద్ధితో వ్యవహరించాలంటే రాజకీయ ప్రయోజనాల కోసం ఆలస్యం చేయకుండా కాళేశ్వరం ప్రాజెక్టు, విద్యుత్ కొనుగోళ్లలో జరిగిన అవినీతిపై సిబిఐ ద్వారా సమగ్ర విచారణ చేపట్టి దోషులను శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. అప్పుడు మాత్రమే వారి నిజాయితి ప్రజలకు స్పష్టమవుతుందని అన్నారు.

ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న రైతు వారోత్సవాల్లో మంగళ వారం హన్మకొండ జిల్లా ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో జరిగిన రాష్ట్రస్థాయి మెగా రైతు మేళా కార్యక్రమాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వ్యవసాయ అభివృద్ధి, రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని స్పష్టం చేశారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటూ:

- రూ.2 లక్షల పంట రుణమాఫీ
- సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్
- ఎకరాకు రూ.12,000 రైతు భరోసా
- దశాబ్దాల భూ సమస్యల పరిష్కారానికి "భూభారతి"
- వంటి పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.

"కాంగ్రెస్ అంటేనే రైతు పక్షపాతి ప్రభుత్వం" అని మంత్రి స్పష్టం చేశారు.

రైతు మేళా - ఆధునిక వ్యవసాయానికి వేదిక మే 5, 6, 7 తేదీలలో నిర్వహిస్తున్న ఈ రైతు మేళాలో రైతులకు అవసరమైన యాంత్రిక పరికరాలను సబ్సిడీపై అందిస్తున్నామని మంత్రి తెలిపారు. రైతు సోదరులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

రైతు మేళా వేదికగా భూసార పరీక్షలు నిర్వహించిన అధికారులకు మంత్రి సర్టిఫికెట్లు అందజేశారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు దనసరి సీతక్క, కొండా సురేఖ, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి, కె.ఆర్. నాగరాజు, మేయర్ గుండు సుధారాణి, అగ్రికల్చర్ సెక్రటరీ, హుడా చైర్మన్, కార్పొరేషన్ చైర్మన్లు, జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అంతకుముందు రైతు మేళాలో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్‌స్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి సందర్శించారు.

# గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను విస్తృతంగా పెంచుతాం

- **ప్రతి రోజు 15 లక్షల మంది ఉపాధి కూలీలకు పనులు కల్పిస్తాం**
- **పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సమీక్షలో మంత్రి సీతక్క**



హైదరాబాద్ వెలుతురు మే 05:

గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను విస్తృతంగా పెంచే దిశగా చర్యలు తీసుకోవాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఉపాధీ హామీ పనుల్లో రోజుకు సుమారు 9 లక్షల మంది కూలీలు పాల్గొంటున్నారని, ఈ సంఖ్యను తక్షణం 15 లక్షలకు పెంచేలా సమగ్ర కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని స్పష్టం చేశారు. గ్రామాల్లో పనుల ప్రణాళికను వేగవంతం చేయడంతో పాటు, అవసరమైన అనుమతులు, సాంకేతిక ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేసి మరిన్ని పనిదినాలు సృష్టించాలన్నారు. కూలీలకు నిరంతర ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రతి జిల్లాలో ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

జిల్లా పరిషత్ సీఈఓలు, DRDOలు, DPO లు, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ వింగ్, మిషన్ భగీరథ అధికారులతో మంత్రి సీతక్క మంగళ వారం నాడు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వరంగల్ లో అధికార పర్యటనలో ఉన్న మంత్రి అక్కడి నుంచే వీడియో కాన్ఫరెన్స్ తీసుకున్నారు. 15 వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం, ఉపాధీ హామీ, సెర్ప్, ఇతర కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. ఈ సమావేశంలో స్పెషల్ సీఎస్ దానకిశోర్, కమిషనర్ దివ్యా దేవరాజన్, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మీ, మిషన్ భగీరథ ENC కృపాకర్ రెడ్డి, ఇంజనీరింగ్ విభాగం ENC జోగారెడ్డి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 15వ ఆర్థిక సంఘం నిధులను కేవలం అనుమతించిన పనులకే వినియోగించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిధులను మళ్లించిన ఘటనలపై సంబంధిత అధికారులు వెంటనే నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.

గ్రామ పంచాయతీల్లో పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బకాయిలను అత్యవసరంగా చెల్లించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.1590 కోట్ల మేర బకాయిలు ఉండటం ఆందోళనకరమని, వీటిని క్లియర్ చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. గ్రామ పంచాయతీలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికా బద్ధంగా చర్యలు చేపట్టాలని చెప్పారు.

ఉపాధి హామీ పథకం అమలులో వేగం పెంచాలని మంత్రి స్పష్టం చేశారు. ఏప్రిల్, మే నెలలకు కేంద్రం మంజూరు చేసిన 6 కోట్ల పనిదినాల్లో, ఏప్రిల్‌లో కోటిన్నర పనిదినాలు సాధించడం సానుకూలమని, మే నెలలో పూర్తి లక్ష్యాన్ని చేరుకోవాలని ఆదేశించారు.

ప్రతి గ్రామంలో పనులు నిరంతరంగా కొనసాగాలని, ఎక్కడా నిలిచిపోకూడదని మంత్రి హెచ్చరించారు. పనితీరు తక్కువగా ఉన్న జనగామ, సంగారెడ్డి, నాగర్‌కర్నూల్, నారాయణపేట, ఖమ్మం జిల్లాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి మండలానికి ప్రత్యేక అధికారులను నియమించి, వారు క్షేత్రస్థాయిలో పర్యటించి పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. కూలీలకు వేతనాల చెల్లింపుల విషయంలో పురోగతి సాధించినట్లు మంత్రి తెలిపారు. కేంద్రంతో సమన్వయం ద్వారా రూ.462 కోట్ల నిధులు విడుదల చేయించామని, ఏప్రిల్ 15 వరకు పెండింగ్ చెల్లింపులు పూర్తయ్యాయని చెప్పారు. పని స్థలాల్లో తాగునీరు, షెడ్లు, ఫస్ట్ ఎయిడ్ వంటి కనీస సదుపాయాలు తప్పనిసరిగా కల్పించాలని ఆదేశించారు.

సెర్ప్ కార్యక్రమాల కింద మహిళా భవనాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని మంత్రి సూచించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం నాటికి జిల్లా మహిళా సమాఖ్యల భవనాలను పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న సుమారు 5 వేల గ్రామీణ మహిళా భవనాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, అదేవిధంగా మహిళా సంఘాల కోసం నిర్మిస్తున్న 46 గోదాముల నిర్మాణాన్ని విస్తరించాలని పేర్కొన్నారు. గ్రామీణ మౌలిక సదుపాయాల భాగంగా 1,900 గ్రామ పంచాయతీ భవనాలు, 1450 అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

# రెండు భారీ జిసిసిలను ఏర్పాటు చేయనున్న బిఎఎస్ ఎఫ్ : 3,000 మందికి కొత్తగా ఉద్యోగాలు



హైదరాబాద్ వెలుతురు మే 05:

హైదరాబాద్: రసాయనాల తయారీలో ప్రపంచంలోని అతి పెద్ద సంస్థల్లో ఒకటైన జర్మన్ దిగ్గజం బిఎఎస్ ఎఫ్ (BASF) హైదరాబాద్ లో రెండు జిసిసి లను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. గ్లోబల్ డిజిటల్ హబ్, గ్లోబల్ సర్వీసెస్ హబ్ ల పేరుతో నెలకొల్పే ఈ రెండు జిసిసి లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వానికి అంగీకార పత్రం (Letter of IntentLOI) సమర్పించింది. మంగళవారం నాడు ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జర్మన్ కాన్సుల్ జనరల్ మైఖేల్ హాస్పర్ ల సమక్షంలో బిఎఎస్ ఎఫ్ గ్లోబల్ బిజినెస్ సర్వీసెస్ అధ్యక్షుడు టోబియాస్ డ్రాట్ తెలంగాణ లైఫ్‌సైన్సెస్ సీఈఓ సర్వేశ్ సింగ్ కు లెటర్ ఆఫ్ ఇంటెంట్ అందజేసారు.

ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఊ ఏడాది 100 జిసిసిల ఏర్పాటును లక్ష్యంగా పెట్టుకున్నట్టు వెల్లడించారు. వీటి ద్వారా లక్ష మంది ఐటి నిపుణులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని తెలిపారు.

హైదరాబాద్ కేవలం కార్యాలయాల కేంద్రంగా మాత్రమే కాకుండా, ఆవిష్కరణలు, ఇంజినీరింగ్ రంగాల్లో ప్రపంచ స్థాయి నగరంగా అభివృద్ధి చేస్తున్నట్టు శ్రీధర్ బాబు తెలిపారు. ఇందులో భాగంగా కృత్రిమ మేథస్సు ఆధారిత కేంద్రం ఐకామ్ (AIKAM), యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, 200 ఎకరాల్లో ఏఐ సిటీ, క్వాంటమ్ హబ్, జీవ విజ్ఞాన పరిశోధన్ సంస్థ '1 బయోల్యాబ్' లను ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు.

"160 సంవత్సరాల చరిత్ర కలిగిన బిఎఎస్ ఎఫ్ ప్రపంచవ్యాప్తంగా 200కి పైగా దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. 234 కర్మాగారాలు, 1,08,000 మంది ఉద్యోగులతో పనిచేస్తున్న ఈ సంస్థ వార్షిక ఆదాయం దాదాపు 5 లక్షల కోట్ల రూపాయలు (60 బిలియన్ డాలర్లు). ప్రపంచంలోని పలు నగరాలతో పోటీ పడి హైదరాబాద్ ఈ ప్రతిష్ఠాత్మక అవకాశాన్ని దక్కించుకోవడం రాష్ట్రానికి దక్కిన గౌరవం.

ఎన్విడియా, మైక్రోసాఫ్ట్, గూగుల్, వాన్‌గార్డ్, ఎలీ లిల్లీ, మారియట్ ఇంటర్నేషనల్ లాంటి దిగ్గజ సంస్థలు ఇక్కడ జిసిసిలు ఏర్పాటు చేసి హైదరాబాద్ నగరానికి ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టాయ"ని శ్రీధర్ బాబు తెలిపారు.

కార్యక్రమంలో BASF ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అలెగ్జాండర్ గెర్డింగ్, గ్లోబల్ బిజినెస్ సర్వీసెస్ అధ్యక్షుడు టోబియాస్ డ్రాట్ , తెలంగాణా ప్రభుత్వ ఐటి అడ్వయిజర్ సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న సిరిసిల్లలో కంప్రెస్స్డ్ బయో గ్యాస్ ప్లాంట్

- **గంబీరావుపేటలో భూమిపూజతో చేసిన డిప్యూటీ సీఎం భట్టి**
- **మంత్రుల సమక్షంలో ఘనంగా కార్యక్రమం**
- **రైతులకు లాభదాయకంగా మారనున్న బయో గ్యాస్ ప్రాజెక్ట్**
- **బయోస్ట్రాటమ్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో అమలు**
- **దేశ గ్యాస్ ఉత్పత్తిలో భాగస్వామ్యం లక్ష్యంగా చర్యలు**
- **పెట్రో ఉత్పత్తులకు ప్రత్యామ్నాయంగా కొత్త దిశ**
- **ఎలక్ట్రిక్ వాహనాలకు అనుసంధానంగా అభివృద్ధి**
- **రైతు ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం**





వెలుతురు, సిరిసిల్ల మే 05:

రాజన్న సిరిసిల్ల జిల్లాలో పారిశ్రామిక, వ్యవసాయ రంగాల సమన్వయంతో ముందుకు తీసుకెళ్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు మరో ముఖ్యమైన అడుగు పడింది. గంబిరావుపేట మండలంలోని పంతులు గారి తోటలో కంప్రెస్స్డ్ బయో గ్యాస్ (సీబీజీ) ప్లాంట్ ఏర్పాటు పనులకు అధికారికంగా శ్రీకారం చుట్టారు. బయోస్ట్రాటమ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్ట్ అమలు కానుండగా, భూమిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరై భూమిపూజ చేశారు. ఆయనతో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర రావు, శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ బయోస్ట్రాటమ్ టెక్నాలజీస్ సంస్థ ఏర్పాటు చేస్తున్న ఈ ప్లాంట్ ప్రాంతీయ రైతాంగానికి మేలు చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. రైతుల నుంచి వచ్చే వ్యవసాయ అవశేషాలు, వ్యర్థాలను వినియోగించి గ్యాస్ ఉత్పత్తి చేయడం ద్వారా రైతులకు అదనపు ఆదాయం లభించే అవకాశముందని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి అనుబంధంగా కొత్త అవకాశాలను ఈ ప్రాజెక్ట్ తెరుస్తుందని అన్నారు. దేశంలో గ్యాస్ ఉత్పత్తిని పెంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయని ఆయన తెలిపారు. మొత్తం గ్యాస్ అవసరాల్లో కనీసం 20 శాతం స్వదేశీ ఉత్పత్తి ద్వారా తీర్చాలన్న లక్ష్యంతో ఈ తరహా ప్రాజెక్టులను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఆ దిశగా సీబీజీ ప్లాంట్లు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.

పెట్రో ఉత్పత్తులపై ఆధారాన్ని తగ్గించే లక్ష్యంతో ప్రభుత్వం ఇప్పటికే పలు కార్యక్రమాలు ప్రారంభించిందని మంత్రి వివరించారు. ఎలకతుర్తి ప్రాంతంలో పెట్రో ఉత్పత్తులకు సంబంధించిన ప్రాజెక్‌ట్‌ను ప్రారంభించినట్లు గుర్తుచేశారు. ఇప్పుడు బయో గ్యాస్ ప్లాంట్ ద్వారా ప్రత్యామ్నాయ ఇంధన వనరులను మరింత బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ రైతులకు ప్రత్యక్షంగా మేలు చేస్తుందని మంత్రి స్పష్టం చేశారు. వ్యవసాయ వ్యర్థాలను విక్రయించడం ద్వారా రైతులకు అదనపు ఆదాయం వస్తుందని, అదే సమయంలో పర్యావరణానికి మేలు జరుగుతుందని అన్నారు. రైతులను ఆర్థికంగా బలపరచడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా ఈ ప్రాజెక్ట్ ప్రాముఖ్యతను వివరించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి ఇలాంటి పరిశ్రమలు అవసరమని చెప్పారు. వ్యవసాయం, పరిశ్రమలు కలిసి పనిచేస్తేనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని ఆయన అభిప్రాయపడ్డారు. రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

ఈ బయో గ్యాస్ ప్లాంట్ పర్యావరణహిత ఇంధన ఉత్పత్తికి దోహదం చేస్తుందని అధికారులు తెలిపారు. కార్బన్ ఉద్గారాలను తగ్గించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో శక్తి అవసరాలను తీర్చడంలో కూడా ఈ ప్రాజెక్ట్ ఉపయోగపడుతుందని చెప్పారు.

ఎలక్ట్రానిక్ వాహనాలకు అనుసంధానంగా కూడా ఈ ప్రాజెక్ట్ ప్రయోజనాలు ఉంటాయని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. భవిష్యత్తులో ఎలక్ట్రిక్ మొబిలిటీకి అవసరమైన శక్తి వనరుల అభివృద్ధిలో ఇలాంటి ప్రాజెక్టులు తోడ్పడతాయని అన్నారు. శుభ్రమైన ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించవచ్చని చెప్పారు.

రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. రైతుల ఉత్పత్తులకు సరైన ధర, అదనపు ఆదాయ వనరులు కల్పించడంలో ప్రభుత్వం ముందుంటుందని తెలిపారు. వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

మొత్తంగా గంబిరావుపేటలో ప్రారంభమైన ఈ కంప్రెస్స్డ్ బయో గ్యాస్ ప్లాంట్ ప్రాజెక్ట్ జిల్లా అభివృద్ధికి కొత్త ఊపునిచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. రైతులకు ఆర్థిక లాభాలు, పర్యావరణ పరిరక్షణ, శక్తి ఉత్పత్తిగా ఈ ప్రాజెక్ట్ నిలవనుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# పడినా లేచే కెరటం.. నీ గుండె నిబ్బరం!



జీవితమనే మహా సంగ్రామంలో కత్తులు, బాణాలు పట్టుకుని యుద్ధం చేసే వీరులు చరిత్ర పుటల్లో కనిపిస్తారు. కానీ, నిశ్శబ్దంగా తనతో తాను యుద్ధం చేస్తూ, ప్రతి రోజూ గెలుస్తున్న సామాన్య అసాధారణ మనుషులు మన చుట్టూనే ఉంటారు. అసలైన ధైర్యం అంటే ఆయుధాలు పట్టడం కాదు. ప్రతి పతనానికీ రెట్టింపు వేగంతో లేచి నిలబడటం. ప్రతి అగాధమైన చీకటిలోనూ ఒక చిన్న ఆశ కిరణాన్ని వెతుక్కోవడం. గుండె ముక్కలైనా, ఆ గాయాలను చిరునవ్వుతో కప్పి ఉంచి లోకానికి వెలుగునివ్వడం. ఈ రోజు మనం మాట్లాడుకోబోయే కథ ఒక వ్యక్తి గురించి మాత్రమే కాదు, మనందరిలో నిద్రపోతున్న ఆ అజేయమైన సంకల్పం గురించి. ఎందుకంటే, ఈ కథ కేవలం చదవడానికి కాదు, గుండె లోతుల్లోకి అనువదించుకోవడానికి! మన వర్తమాన సమాజంలో గొప్పతనం అనే పదానికి నిర్వచనం మారిపోయింది. బ్యాంక్ బ్యాలెన్స్, బహుళ అంతస్తుల భవనాలు, అధికార పీఠాలు వీటినే విజయానికి కొలమానాలుగా భావిస్తున్నాం. కానీ, జీవిత సత్యాన్ని ఒడిసి పట్టుకున్న వారికి ఈ నిర్వచనాలు చాలా చిన్నవిగా, వెలవెలబోతూ కనిపిస్తాయి. నిజమైన గొప్పతనం అంటే నీకు కనీసం ఒక్క అడుగు ముందుకు వేసే శక్తి కూడా లేని సమయంలో, పక్కనున్న వాడికి నీ భుజం ఆసరాగా ఇవ్వడం. నీ కంటి నుంచి కన్నీరు కారుతున్నా, అవతలి వ్యక్తి కన్నీటిని తుడవడానికి చేయి చాపడం. ఇది వినడానికి ఒక అందమైన కవితలా ఉండవచ్చు, కానీ ఆ క్షణాన్ని అనుభవించే వారికి అది ఒక నిప్పుల మీద నడక. అయినప్పటికీ, కొందరు ఆ కఠినమైన మార్గాన్నే ఎన్నుకుంటారు. ఎందుకంటే వారి గుండెల్లో మండుతున్న మానవత్వపు జ్వాల వారిని అలా నడిపిస్తుంది. పడిపోవడం పరాజయం కాదు పడిపోయిన చోటే ఉండిపోవడం నిజమైన ఓటమి. నీ గుండె గనుక నిబ్బరంగా ఉంటే, నీవు నడిచే ప్రతి వీధి విజయం వైపు వెళ్లే రాజమార్గమే అవుతుంది.

జీవితం ఒక క్రూరమైన ఉపాధ్యాయుడి లాంటిది. పాఠం చెప్పకముందే పరీక్ష పెడుతుంది. ఒక్కో దశలో ఒక్కో రకమైన అగ్నిపరీక్ష మనల్ని ఎదురుచూస్తుంది. కొన్నిసార్లు తిండికి లేని పేదరికం వేధిస్తుంది, కొన్నిసార్లు సమాజం విసిరే అవమానాల విమర్శలు వెన్నుపోటు పొడుస్తాయి, మరికొన్నిసార్లు మనం ప్రాణప్రదంగా నమ్మిన ఆత్మీయులే వెన్నుపోటు పొడుస్తారు. ఇవన్నీ ఒక మనిషిని లోపలి నుండి చెదపురుగులా తినేస్తాయి. కానీ, ఆ నరకాన్ని మనస్సులోనే బంధించి, బయటి ప్రపంచానికి వసంత కాలంలాంటి చిరునవ్వును పంచడం ఒక యజ్ఞం. ఇది అందరికీ సాధ్యం కాదు.ఇది కేవలం అచంచలమైన గుండె ధైర్యం ఉన్న మహనీయులకే సాధ్యం.ధైర్యం అంటే కేవలం శత్రువుపై విరుచుకుపడటం మాత్రమే కాదు. దానికి అనేక సున్నితమైన రూపాలు ఉన్నాయి.మాతృమూర్తి తపస్సు తన కడుపు మాడ్చుకుని, పిల్లల భవిష్యత్తు కోసం అహర్నిశలు శ్రమించే తల్లిలో ఉండేది అసలైన ధైర్యం.విద్యార్థి పోరాటం పూట గడవని పేదరికంలో ఉంటూ, చిరిగిన పుస్తకాలతో కలెక్టర్ అవ్వాలని కలలు కనే విద్యార్థి పట్టుదల ఒక ధైర్యం.రైతు నమ్మకం వర్షం రాక పంట ఎండిపోయినా, అప్పుల కుప్పలో కూరుకుపోయినా, మళ్ళీ ఆకాశం వైపు చూసి విత్తనం చల్లే అన్నదాతది సాటిలేని ధైర్యం.వ్యాధిగ్రస్తుని ఆశ మృత్యువు ముంగిట నిలబడి కూడా, తన శరీరంలోని నొప్పిని భరిస్తూ నేను మళ్ళీ కోలుకుంటాను అని నమ్మే రోగిది అనిర్వచనీయమైన ధైర్యం.నాయకుడి నిజాయితీ అందరూ అబద్ధాల బాటలో వెళ్తున్నప్పుడు, ఒంటరివాడైనా సరే సత్యం వైపు నిలబడే వ్యక్తిది హిమాలయమంత ధైర్యం.మన తెలుగు నేల మీద ఇలాంటి ధైర్యవంతులు వేల సంఖ్యలో ఉన్నారు. వీరి గురించి ఏ పత్రికా హెడ్‌లైన్స్ వేయదు, ఏ ఛానెల్ బ్రేకింగ్ న్యూస్ ఇవ్వదు. కానీ వారి జీవన ప్రయాణం ఒక అడవి పూవు లాంటిది. ఎవరూ చూడకపోయినా, ఎవరూ మెచ్చుకోకపోయినా తన పనిగా తాను సువాసనలను వెదజల్లుతూనే ఉంటుంది. ఆ సువాసనే ఈ వ్యాసానికి అసలైన ప్రేరణ.మహత్తరమైన జీవితాలన్నీ కచ్చితంగా ఒక అగ్నిపరీక్షను దాటుకుని రావాల్సిందే. బంగారం భూమి పొరల్లో ఉన్నప్పుడు కేవలం ఒక ముడి పదార్థం మాత్రమే. అది నిప్పులో కాలి, దెబ్బలు తిన్నప్పుడే ఆభరణంగా మారుతుంది. మనిషి విలువ కూడా అంతే. ఒత్తిళ్లు ఎదురైనప్పుడు కొందరు విరిగిపోతారు, కొందరు వంగిపోతారు. కానీ, చాలా తక్కువ మంది మాత్రమే ఆ నిప్పును తమ శక్తిగా మార్చుకుని మేలిమి బంగారంలా బయటకు వస్తారు. ఈ తేడాను సృష్టించేది వారి బ్యాంక్ అకౌంట్ కాదు, వారి గుండె ధైర్యం.సాధారణంగా మనం కష్టాలు రాగానే విధిని శపిస్తాం. నాకే ఎందుకు ఇలా జరుగుతోంది? అని దేవుడిని నిలదీస్తాం. కానీ నిజమైన ధైర్యశాలి పరిస్థితులను నిందించడు. వాడు తన అదృష్టాన్ని తన చెమట చుక్కలతో రాసుకుంటాడు. నాకు అవకాశం రాలేదు అని ఏడవడు, నేనే ఒక అవకాశాన్ని సృష్టిస్తాను అని కంకణం కట్టుకుంటాడు. ఇదే ఒక సామాన్యుడిని చరిత్ర సృష్టించే నాయకుడిగా మారుస్తుంది.మన పురాణాల్లో కూడా శ్రీకృష్ణ పరమాత్మ అర్జునుడికి చెప్పింది ఇదే. కురుక్షేత్ర యుద్ధంలో గాండీవం జారిపోతున్నప్పుడు, మనస్సు కలత చెందుతున్నప్పుడు, కృష్ణుడు బోధించిన స్థితప్రజ్ఞత ఆత్మ నిబ్బరానికి నిదర్శనం. లోపలి భయాలను, అనుమానాలను చంపుకోగలిగితే, బయట ఉన్న ఏ శత్రువైనా తలవంచాల్సిందే. ఎందుకంటే నిజమైన యుద్ధం బయట కాదు, మన లోపలే జరుగుతుంది.ధైర్యం అనేది కేవలం మన స్వార్థం కోసం, మన విజయం కోసం వాడుకునే ఆయుధం కాకూడదు. అది సమాజానికి ఒక నీడను ఇచ్చే చెట్టులా ఉండాలి. నీవు శిఖరాన్ని చేరుకున్న తర్వాత, కింద ఉన్న వారిని పైకి లాగడానికి నీ చేయి చాచకపోతే, నీ విజయానికి విలువే లేదు. ఒక ధైర్యవంతుడు తన వెలుగులో పదిమందిని నడిపిస్తాడు. సామూహిక ఎదుగుదల కోసం పాటుపడతాడు.నేడు సమాజంలో ఎన్నో సమస్యలు. పేదరికం, నిరక్షరాస్యత, అన్యాయం. వీటిని చూసి తల తిప్పుకోవడం పిరికితనం. వాటిని ఎదురించి, ఒక్క చిన్న మార్పుకైనా ప్రయత్నించడం అసలైన పౌరుషం. ఒక అనాథకు అన్నం పెట్టడం, ఒక పేద విద్యార్థికి పుస్తకం ఇవ్వడం, నిరాశలో ఉన్నవారికి ఓదార్పునివ్వడం ఇవన్నీ గుండెల్లో ధైర్యం, ప్రేమ ఉన్నవారే చేయగలరు. డబ్బు లేకపోవచ్చు, కానీ సాయం చేసే గుణం ఉంటే నీవే అందరికంటే ఐశ్వర్యవంతుడివి. గుండె ధైర్యంగా ఉన్నప్పుడే మనిషి మనిషిగా జీవిస్తాడు అది లేనినాడు, ఆ శరీరం కేవలం గాలి నింపిన తిత్తి మాత్రమే.ఈ ప్రపంచం ప్రస్తుతానికి అశాంతితో, పోటీతో, నిరాశతో నిండిపోయి ఉండవచ్చు. కానీ చరిత్రను ఒక్కసారి తిరగేస్తే ఒక అద్భుతమైన సత్యం కనిపిస్తుంది. చీకటి ఎంత దట్టంగా ఉన్నా, ఒక్క చిన్న దీపం దాన్ని పారద్రోలగలదు. ఆ దీపమే మనిషి హృదయంలోని అజేయమైన ధైర్యం. ఈ ప్రపంచంలో ఏ శక్తీ ఆ వెలుగును ఆర్పలేదు, ఏ తుపాను దాన్ని వణకించలేదు.మనం మన రాబోయే తరాలకు, మన పిల్లలకు ఏమి ఇస్తున్నాం? ఆస్తులా? అంతస్తులా? కాదు. మనం వారికి ఇవ్వవలసిన అతిపెద్ద ఆస్తి ధైర్యం . కష్టం వస్తే కుంగిపోకూడదని, ఓటమి ఎదురైతే వెనకడుగు వేయకూడదని, గుండె పగిలినా మానవత్వాన్ని వదలకూడదని వారికి నేర్పించాలి. పడిపోయినా మళ్ళీ లేచి నిలబడటమే అసలైన గెలుపు అని వారి రక్తంలో ప్రవహించేలా చేయాలి.ఈ వ్యాసం చదువుతున్న మిత్రులారా మీ చుట్టూ ఉన్న చిన్న చిన్న ధైర్యవంతులను ఒకసారి గమనించండి. అది మీ పక్కనే ఉన్న కిరాణా కొట్టు యజమాని కావచ్చు, రోడ్లు ఊడ్చే పనిమనిషి కావచ్చు, లేదా మీ నాన్న కావచ్చు. గుర్తింపు లేని వారి పోరాటాన్ని ఒక్కసారి అభినందించండి. ధైర్యాన్ని గౌరవించే సమాజం ఎప్పుడూ వెనుకబడదు. చివరగా ఒక్క మాట.. ధైర్యంగా జీవించడం అంటే నొప్పి తెలియకపోవడం కాదు. ఆ నొప్పిని భరిస్తూనే, కన్నీళ్లను దిగమింగుతూనే, లోకం కోసం ముందడుగు వేయడం. నీ హృదయంలో ఆశ, ప్రేమ, సేవ అనే మూడు రంగులు ఉన్నంత కాలం నీవు ఈ ప్రపంచంలోనే అతిపెద్ద విజేతవు. నీ గుండె ధైర్యమే నీకు అసలైన రక్ష! అడవిలో పూసిన పువ్వును ఎవరూ చూడకపోవచ్చు కానీ దాని సువాసన మాత్రం గాలిలో కలిసి అందరినీ స్పర్శిస్తుంది. గుండె ధైర్యం కూడా అంతే దానికి మైకుల ప్రచారం అక్కరలేదు, ఆ వెలుగు తన చుట్టూ ఉన్న చీకటిని చీల్చుకుంటూ తప్పకుండా ముందుకు సాగుతుంది.



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

## తిరుమల శ్రీవారికి కోటి రూపాయలు విరాళం ఇచ్చిన అజ్ఞాత భక్తుడు




హైదరాబాద్ వెలుతురు మే 05:

టీటీడీ అన్నప్రసాదం ట్రస్టుకు భారీ విరాళం.

హైదరాబాద్‌కు చెందిన అజ్ఞాత భక్తుడి ఉదారత రూ. 1,00,10,116 డీడీని ఈవోకు అందజేత శ్రీవారి సేవలో భాగంగా విరాళం ఇచ్చిన భక్తుడు

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో నడిచే శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుకు భారీ విరాళం అందింది. హైదరాబాద్‌కు చెందిన పేరు వెల్లడించడానికి ఇష్టపడని ఓ భక్తుడు సోమవారం రూ. 1,00,10,116 విరాళంగా సమర్పించారు. తిరుమలకు వచ్చే వేలాది మంది భక్తులకు ఉచితంగా భోజనం అందించే అన్నదానం కార్యక్రమానికి ఈ నిధులను వినియోగించనున్నారు.

తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో ఈవో ఎం.రవిచంద్రను ఆ భక్తుడు స్వయంగా కలిశారు. ఈ విరాళానికి సంబంధించిన డిమాండ్ డ్రాఫ్ట్ ను (డీడీ) ఆయనకు అందజేశారు. శ్రీవారి సేవలో భాగంగా, భక్తుల అన్నదానం కోసం ఈ విరాళాన్ని అందిస్తున్నట్లు ఆ భక్తుడు తెలిపినట్లు సమాచారం.

ఈ విరాళంపై టీటీడీ అధికారిక ప్రకటన విడుదల చేసింది. "శ్రీవారి సేవలో భాగంగా ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్ కు హైదరాబాద్‌కు చెందిన ఓ అజ్ఞాత భక్తుడు రూ.1,00,10,116 విరాళం అందజేశారు," అని టీటీడీ ఆ ప్రకటనలో పేర్కొంది. అజ్ఞాత భక్తుడి ఉదారతను టీటీడీ ఈవో రవిచంద్ర ప్రత్యేకంగా అభినందించారు. అన్నప్రసాదం సేవలకు ఈ విరాళం ఎంతగానో తోడ్పడుతుందని ఆయన తెలిపారు.

## అక్రెడిటేషన్ కమిటీ నిర్ణయాలను నిలిపివేయండి హైకోర్టులో టీడబ్ల్యూజేఎఫ్ పిటిషన్



హైదరాబాద్, వెలుతురు మే 05:

మీడియా అక్రెడిటేషన్ కార్డులు జారీ చేయడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన రాష్ట్ర, జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీ లు చేసిన, చేయబోయే నిర్ణయాలను నిలిపివేయాలంటూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య తెలంగాణ హైకోర్టులో మంగళవారం పిటిషన్ దాఖలు చేశారు. రాష్ట్ర మీడియా అక్రెడిటేషన్ కమిటీ(ఎస్ ఎంఏసీ), జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీ(డీఎంఏసీ) లలో తమ టీడబ్ల్యూజేఎఫ్ సభ్యులకు అవకాశం కల్పించకుండా నిబంధనలకు విరుద్ధంగా కమిటీల ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేసి అక్రెడిటేషన్ కార్డులపై నిర్ణయాలు చేస్తున్నారని ఆయన పిటిషన్ లో పేర్కొన్నారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో 252 ప్రకారం కమిటీలో నాలుగు జర్నలిస్టు యూనియన్ లు/సంఘాల ప్రతినిధులు ఉండాలని, కానీ కేవలం మూడు యూనియన్ ల/సంఘాల ప్రతినిధులను మాత్రమే చేర్చి తమ యూనియన్ ప్రతినిధులను తీసుకోకుండా పెండింగ్ పెట్టి ముందుకు వెళుతున్నారని తెలిపారు. ఈ పిటిషన్ లో ఐఅండ్ పీఆర్ స్పెషల్ కమీషనర్, మీడియా అకాడమీ ఛైర్మెన్ లతో పాటు 33 జిల్లాల ప్రజా సంబంధాల అధికారులు (డీపీఆర్వో) లను ప్రతివాదులుగా చేర్చారు.

**అక్రెడిటేషన్ కమిటీల జీవో 229 రద్దు చేయాలని హైకోర్టులో పిటీషన్**

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మీడియా అక్రెడిటేషన్ల జీవో 252 కి అనుబంధంగా రాష్ట్ర, జిల్లా అక్రెడిటేషన్ కమిటీల ఏర్పాటు కోసం జారీ చేసిన జీవో ఆర్టీ 229 ను నిబంధనలకు విరుద్ధంగా అమలు చేసినందున ఈ జీవోను రద్దు చేయాలంటూ హైకోర్టు లో మంగళవారం పిటిషన్ దాఖలైంది. టీడబ్ల్యూజేఎఫ్ సభ్యుడు, ఏవీఎన్ టీవీ కరస్పాండెంట్ నంబి పర్వతాలు అనే జర్నలిస్టు జీవో 229 అమలు తీరుపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ హైకోర్టులో కేసు ఫైల్ చేశారు. అక్రెడిటేషన్ కమిటీలలో నాలుగు జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు ఉండాలని జీవో 252లో పేర్కొనగా, జీవో ఆర్టీ 229 ద్వారా కేవలం మూడు సంఘాల ప్రతినిధులను మాత్రమే తీసుకున్నారని, టిడబ్ల్యూజేఎఫ్ యూనియన్ ప్రతినిధులను కమిటీల్లోకి తీసుకోకుండా కమిటీ నిర్ణయాలు చేయడం జీవో 252 కు విరుద్ధమని, అందుకని ఈ జీవో ఆర్టీ 229ను సస్పెండ్ చేయాలని హైకోర్టును కోరారు. ఈ పిటిషన్ లో కూడా ఐఅండ్ పీఆర్ స్పెషల్ కమీషనర్ ను, మీడియా అకాడమీ ఛైర్మన్,అన్ని జిల్లాల డీపీఆర్వోలను ప్రతివాదులుగా చేర్చారు.

# ఉన్న ఓట్ల తొలగించకుండా, దొంగ ఓట్లను చేర్చకుండా ప్రతి నాయకుడు, కార్యకర్త అప్రమత్తతతో పనిచేయాలి

**:ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, పార్లమెంట్ ఇంచార్జీ**





కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) మే 05:

ఈనెల 11వ తేదీ నుంచి కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ప్రారంభం కానున్న Special Intensive Revision (సర్) కార్యక్రమంపై బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్ పరిధి గండిమైసమ్మలోని బిఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) అవగాహన సమావేశానికి బిఆర్ఎస్ ఎల్పీవిప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, పార్లమెంట్ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై నియోజకవర్గానికి చెందిన అన్ని డివిజన్లలోని మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల సభ్యులకు సర్ కార్యక్రమ నిర్వహణ, జాగ్రత్తలు మరియు సభ్యత్వ నమోదు, నూతన కమిటీల ఏర్పాటుపై దిశానిర్దేశం చేశారు.

**ఈసందర్భంగా వారు మాట్లాడుతూ....**

Special Intensive Revision (సర్). స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్)పేరుతో కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో 2002 సంవత్సరం జనాభా లెక్కల ప్రాతిపదికన నిర్వహించనున్నారు. 2002 జనాభా లెక్కల ప్రకారం ఎంతమంది ఓటర్లు ఉన్నారు. వారి కుటుంబ సభ్యుల వివరాలను సేకరించి ప్రస్తుతం ఉన్న ఓట్లతో పాటు నూతన ఓటర్లను కూడా నమోదు చేయనున్నారు.

ఈ సర్ కార్యక్రమంలో ప్రతి బూత్ స్థాయి ఏజెంటు బూత్ స్థాయి అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రతి ఓటరును కాపాడుకుంటూ ఓట్లను తొలగించకుండా అప్రమత్తంగా ఉండేలా ప్రతి నాయకుడు, కార్యకర్త పని చేయాలి. అదేవిధంగా దొంగ ఓట్లు నమోదు కాకుండా నాయకులు, బూత్ స్థాయి ఏజెంట్లు అప్రమత్తతో వ్యవహరించాలని కోరారు. సర్ కార్యక్రమ నిర్వహణపై త్వరలోనే డివిజన్ల వారీగా మరోమారు ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

సభ్యత్వ నమోదు కార్యక్రమం

పార్టీకి కార్యకర్తలే బలమని, బిఆర్ఎస్ పార్టీ పట్ల రాష్ట్రంలో రోజు రోజుకు పెరుగుతున్న ఆదరణను దృష్టిలో ఉంచుకొని త్వరలోనే సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టాలని తెలిపారు. సభ్యత్వ నమోదు కార్యక్రమం అనేది రానున్న రోజుల్లో చాలా క్రియాశీలకంగా వ్యవహరించే అంశమని, సభ్యత్వ నమోదులో పార్టీ పట్ల నాయకులకు ఉన్న నిబద్ధతను తెలియజేస్తుంది. సభ్యత్వ నమోదు కార్యక్రమం ద్వారా పార్టీని మరింత బలోపేతం చేసే విధంగా ప్రతి నాయకుడు, కార్యకర్త పని చేయాలన్నారు.

త్వరలోనే నూతన కమిటీల ఏర్పాటు

బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించిన విధంగా రాష్ట్ర కమిటీ మినహా అన్నీ కమిటీలు రద్దయ్యాయని, త్వరలోనే పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న ప్రతీ నాయకుడు, కార్యకర్తకు సముచిత స్థానం కల్పించేలా నూతన కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, మున్సిపల్/ డివిజన్/వార్డు అధ్యక్షులు, సీనియర్ నాయకులు, మహిళా నాయకురాళ్ళు, యువజన విభాగం నాయకులు సభ్యులు, పార్టీ వివిధ అనుబంధ సంఘాల నాయకులు సభ్యులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

ములుగు జిల్లా కేంద్రంలో హనుమాన్ భక్తులకు అన్నదానం

# మంత్రి సీతక్క హాజరు





ములుగు వెలుతురు మే 05:

ములుగు జిల్లా కేంద్రంలోని రామాలయం ప్రాంగణంలో హనుమాన్ స్వామి మాలాధారులకు అన్నదానం కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, RWS మరియు స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి వర్యులు శ్రీమతి ధనసరి అనసూయ సీతక్క గారు హాజరై భక్తులతో కలిసి పాల్గొన్నారు. హనుమాన్ మాలదారులకు *భిక్ష వడ్డించారు* అనంతరం మంత్రి సీతక్క గారు వారితో కలిసి భిక్ష చేశారు

ఈ సందర్భంగా మంత్రి సీతక్క గారు మాట్లాడుతూ, హనుమాన్ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా రామాలయం ప్రాంగణంలో భారీ రేకుల షెడ్డు నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు. అలాగే గట్టమ్మ ఆలయం సమీపంలో భక్తుల ఆకాంక్షలను దృష్టిలో ఉంచుకొని భారీ అభయాంజనేయ స్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. హనుమాన్ భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని, భక్తుల సేవలో ఎల్లప్పుడూ ముందుంటామని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, ములుగు మున్సిపల్ చైర్పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, మున్సిపల్ వార్డు సభ్యులు, హనుమాన్ మాలాధారులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## దాద్ పల్లి గ్రామానికి ఇందిరమ్మ ఇండ్లు, సిసి రోడ్లు మంజూరు చేసిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు



- **-కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు పాలకుర్ల శేఖర్ గౌడ్**

మంచాల వెలుతురు మే 05:

మంచాల మండలం దాద్ పల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు పాలకుర్ల శేఖర్ గౌడ్ మాట్లాడుతూ అడగగానే దాద్ పల్లి గ్రామానికి ఇందిరమ్మ ఇండ్లు సీసీ రోడ్లు మంజూరు చీదేడ్ గ్రామంలో విద్యుత్ సబ్ స్టేషన్ కు భూమి కేటాయింపు సబ్ స్టేషన్ నిర్మాణానికి నిధులు మంజూ రు చేయించిన ప్రియతమాఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేమల్ రెడ్డి రంగారెడ్డిగారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు ఇప్పటివరకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణాలు పూర్తి అయిన తర్వాత అర్హులైన పేద కుటుంబాల అందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయిస్తాంఅని అన్నారు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే సహకారంతో అర్హులైన ప్రతిపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు రేషన్ కార్డులు మంజూరు గ్రామంలో పూర్తిస్థాయిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్నిరకాల మౌలిక వసతులతో అభివృద్ధి చేయిస్తాం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజాపాలన ప్రభుత్వం గ్రామాలనుపూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పాలన కొనసాగిస్తుంది అని అన్నారు

# బిజెపి 3 రాష్ట్రాలలో విజయం సాధించడంతో ఆరుట్ల గ్రామంలో బిజెపి పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు

- **ప్రధాని నరేంద్రమోధీ దేశం కోసం చేస్తున్న సేవలే మూడు రాష్ట్రాల్లో బిజెపి పార్టీని గెలిపించాయి**
- **మంచాల మండలం బిజెపి పార్టీ అధ్యక్షుడు నూకం రాజు ముదిరాజ్**

మంచాల వెలుతురు మే 05:



మంచాల మండలం ఆరుట్ల గ్రామంలోబిజెపి పార్టీ గ్రామశాఖ కన్వీనర్ కొత్తపల్లి శేఖర్ గౌడ్ కో క న్వీనర్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో బాణా సంచాకాల్చి సంబరాలు ఘనంగా నిర్వహించారు ఈ కా ర్యక్రమంలో ముఖ్యఅతిగా పాల్గొన్న మండల అధ్యక్షులు ఉపసర్పంచ్ నూకంరాజు ముదిరాజ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వములోదేశం అభివృద్ధితోముందుకు సాగుతుంద ని ప్రపంచ దేశాలన్నీ యుద్ధ వాతావరణంలో ఉంటే భారత్ మాత్రం సుభిక్షంగా ఉందని అన్నారు అం దుకే మోదీజీ నాయకత్వానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు బీజేపీ పార్టీనిఆద రించిన రాష్ట్రాల ప్రజలకు ధన్యవాదలు తెలిపారు ఈకార్యక్రమంలో బిజెపి జిల్లానాయకులు పాం డాల జంగయ్యగౌడ్ పిఎసిఎస్ మాజీ డైరెక్టర్ కొంగర జనార్దన్ రెడ్డి బిజెపి సీనియర్ నాయకులు మెం డు వెంకట రెడ్డి కొంగర వెంకటరెడ్డి గంటా నరసింహారెడ్డి మాజీ వార్డ్ నెంబర్ మంద మోహన్ రెడ్డి గంట నరసింహారెడ్డి కొంగ శేఖర్ రెడ్డి సత్తిరెడ్డి దండు భగవంత్ రెడ్డి పెద్దిరెడ్డి యాదగిరిరెడ్డి గు డ్డిమల్ల సత్యనారాయణ ముదిరాజ్ చంద్రమౌళిచారి దాన్నేమల్లేష్రామచంద్రారెడ్డి అంతటి చంద్ర మౌళి గౌడ్ అచ్చన రవి గుడ్డిమల్ల వెంకటేష్ముదిరాజ్ గుడ్డిమల్ల హరి ముదిరాజ్ పాశం బాలరా జు గౌడ్ మాడుగుల రాజుగౌడ్ గంట కర్ణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి శరగడం నర్సింగరావు కి “శ్రామిక శక్తి అవార్డు”

కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) మే 05:




కుత్బుల్లాపూర్ చెందిన టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి శరగడం నర్సింగరావు కి *“శ్రామిక శక్తి అవార్డు” లభించిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, టీపీసీసీ లేబర్ సెల్ చైర్మన్ ఆర్. ప్రకాష్ గౌడ్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి శ్రీ కొలన్ హనుమంత్ రెడ్డికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శ్రమశక్తి అవార్డు వచ్చిన సందర్భంగా శరగడం నర్సింగరావు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం హనుమంత్ రెడ్డి ఆయనకు శాలువా కప్పి సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేయాలని వివరించారు. ఈ అవార్డు రావడంతో మరింత బాధ్యత పెరిగిందని సూచించారు. నర్సింగరావు మాట్లాడుతూ... కార్మికుల సంక్షేమం కోసం అహర్నిశలు పాటుపడతానని తెలిపారు. ఈకార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బిసి గురుకులాల్లో ఇంటర్మీడియట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి.

- **హైదరాబాద్ ఆర్ సి ఓ**

హైదరాబాద్ వెలుతురు మే 05:



మహాత్మా జ్యోతిభాపూలే తెలంగాణ బిసి గురుకుల ఇంటర్మీడియట్ కళాశాలల్లో 202627 విద్యా సంవత్సరంలో అడ్మిషన్ల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలనీ హైదారాబాద్ ఉమ్మడి జిల్లాల బిసి గురుకులం పాఠశాలలు మరియు కళాశాలల రీజినల్ కో ఆర్డినేటర్ (ఆర్ సి ఓ ) గౌతం కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 202526 సంవత్సరం లో పదవ తరగతి లో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 12 వ తేదీ లోగా మీసేవ కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. హైదారాబాద్ జిల్లాలో 14 బాలుర మరియు 14 బాలికల కళాశాలలు (ఇంగ్లీష్ మీడియం) ఉన్నాయని, ఎంపీసీ, బైపిసి, సీఈసీ, హెచ్ఈసి మరియు ఈ సంవత్సరం ఏసీఈ కొత్త గ్రూప్ అందుబాటులో ఉన్నాయని, వృత్తి విద్యా కోర్సులో కంప్యూటర్ గ్రాఫిక్స్ అండ్ యానిమేషన్ కూడా ఉన్నాయని ఆర్సీవో తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సంవత్సరం ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలలో బిసి గురుకులం కళాశాలల విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించారనీ ఆర్సీఓ చెప్పారు.

# ఆశా కిరణ్ చిన్నారుల హోమ్‌లో ఐటీ నిపుణురాలి సేవా దృక్పథం



హైదరాబాద్ వెలుతురు మే 05:

హైదరాబాద్‌కు చెందిన ఐటీ నిపుణురాలు మెలిస్సా స్మిత్, తన ఖాళీ సమయంలో కోడింగ్ లేదా సిస్టమ్ మేనేజ్‌మెంట్‌లో మునిగిపోకుండా, రామకృష్ణాపురంలోని గాంధీనగర్‌లో ఉన్న 'ఆశా కిరణ్' చిన్నారుల హోమ్‌కు అండగా నిలిచేందుకు ఒక గొప్ప కార్యక్రమాన్ని చేపట్టారు.
ఈ సంస్థను క్రైస్తవ సన్యాసినులు (Nuns) ఒక ప్రభుత్వేతర సంస్థగా నిర్వహిస్తున్నారు.
అనేకమంది నిరుపేద చిన్నారులకు ఆశ్రయం కల్పిస్తున్న ఆశా కిరణ్ హోమ్, వారి దైనందిన అవసరాల కోసం దాతల సహాయంపై ఆధారపడుతోంది. మెలిస్సా గత వారం మొదటిసారిగా ఈ హోమ్‌ను సందర్శించారు. తాజాగా ఆమె తిరిగి అక్కడికి వెళ్లి హోమ్ అవసరాల కోసం బియ్యం, పప్పు, వంట నూనె మరియు తినుబండారాలను (Snacks) విరాళంగా అందించారు.
నేను రోజంతా డేటాతో పని చేస్తాను, కానీ ఇక్కడ గడిపే సమయమే నాకు నిజమైన తృప్తిని ఇస్తుంది. ఇక్కడి సిస్టర్స్ చాలా తక్కువ వనరులతో ఎంతో గొప్ప సేవ చేస్తున్నారు. వారి చింతను నేను కొంచెమైనా తగ్గించగలిగితే, అది నాకు ఎంతో సంతోషాన్నిస్తుంది" అని మెలిస్సా పేర్కొన్నారు.
స్క్రీన్‌లు మరియు డెడ్‌లైన్‌లతో నిండిపోయే ఐటీ రంగంలో ఉంటూ కూడా, మెలిస్సా చేస్తున్న ఈ ప్రయత్నం సమాజంపై ప్రభావం చూపడానికి కేవలం ఒక సంచి నిత్యావసర వస్తువులతో కూడా మొదలుపెట్టవచ్చని నిరూపిస్తోంది.

# ఆశావర్కర్ల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి



- **సీఐటీయు మంచాల మండలం కన్వీనర్ పోచమోని కృష్ణ**

మంచాల వెలుతురు మే 05:

మంచాల మండలం ఆరుట్ల గ్రామం లోఆశ వర్కర్లకు పెండింగ్ లో ఉన్న రెండు నెలల వేతనాలు పారితోషి కాలు వెంటనే చెల్లించాలని సీ ఐ టీ యు మండల కన్వీనర్ పొచమోని కృష్ణ డిమాండ్ చేశారు ఆశవర్కర్ల యూనియన్(సీఐటీయు)ఆధ్వర్యంలో పెండింగ్ లోఉన్న వేతనాలు పా రితోషికాలు వెంటనే చెల్లించాలని కోరుతూ ఆరుట్లకు వచ్చిన డిప్యూటీ డీమ్ హెచ్ ఓ లక్ష్మీకిమంచాల పి హెచ్ సీ లో మెడికల్ ఆఫీసర్ కు వినతి పత్రం అందజేశారుఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నిత్యం ఆశలతోపనులు చేయించి నట్లు వారికి వేతనాలు కూడా నెలనెలా చెల్లించాలని అ న్నారు నెలనెలా వేతనాలు పారితోషికాలు అందకపోతే వారి కుటుంబాలను ఎలాగడుపు కుంటార ని ఆవేదన వ్యక్తం చేశారుఎన్నికల కంటే ముందు కాంగ్రెస్ ప్రభుత్వము ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఆశ వర్కర్లు గత ప్రభుత్వ హయాంలో సమ్మె నిర్వహిస్తా ఉంటే అక్కడికి వచ్చి మేముఅధికారంలోకి వస్తే ఆశావర్కర్లకు వేతనాలు పెంచుతామని ఫిక్స్డ్ వేతనం 18000 చేస్తామని ఉద్యోగ భద్ర త కల్పిస్తామని అలాగే వారి సమస్యలు అన్నింటిని పరిష్కారం చే స్తామని హామీ ఇచ్చి అధికారం లోకి వచ్చిన తర్వాత వాటిని గాలికి వది లేసిన పరిస్థితి ఉందని అన్నారుఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారుఈ కార్యక్రమంలో ఆశవర్కర్ల యూనియన్ మండల అధ్యక్షురాలు నవనీత నాయకులు అమృత అలివేలు అమృత రజిత ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు

# ముదిరాజులను బీసీ- డీ నుండి బీసీ ఏలోకి మార్చాలని ముదిరాజ్ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో ప్రముఖులకు వినతి

- **మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి ముదిరాజులకు వినతి పత్రం అందజేసిన విద్యావంతుల వేదిక సభ్యులు**
- **అనంతరం బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ తో ప్రత్యేక సమావేశం లో పాల్గొన్న ప్రతినిధులు**

హైదరాబాద్ వెలుతురు మే 05:





తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బీసీలలో ముదిరాజుల జనాభానే ఎక్కువగా ఉందని ఇది ప్రభుత్వం అధికారికంగా ప్రకటించిన విషయమేనని, జనాభాపరంగా ఎక్కువగా ఉన్నప్పటికీ వారు విద్యా ఉద్యోగ ఉపాధి రంగాల్లో వెనుకబడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే ముదిరాజులను బిసి డి నుండి బీసీఏ లోకి మార్చాలని ముదిరాజ్ విద్యావంతుల వేదిక చైర్మన్ ప్రొఫెసర్ దినేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో మంగళవారం రోజు మినిస్టర్ క్వార్టర్స్ లో మత్స్య మరియు క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ లను కలసి వినతి పత్రాలు అందజేయడం జరిగింది. సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని మంత్రులు హామీ ఇచ్చారు. అనంతరం ఖైరతాబాద్ లోని బీసీ కమిషన్ చైర్మన్ జి నిరంజన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశానికి హాజరై ముదిరాజ్ విద్యావంతుల వేదిక చైర్మన్ ప్రొఫెసర్ దినేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ముదిరాజ్ సమస్యలను కమిషన్ చైర్మన్ అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ విద్యావంతుల వేదిక కన్వీనర్లు డాక్టర్ జులు నాగేశ్వర్ ముదిరాజ్, డాక్టర్ చెన్నయ్య ముదిరాజ్, ఎస్ నాగేశ్వర్ ముదిరాజ్, కర్మన్ ఘాట్ ధ్యానాంజనేయ ఆలయ డైరెక్టర్ పూల నాగరాజు, ప్రముఖ సామాజికవేత్త పిట్టల కుమార్, డాక్టర్ ఈర్ల రాకేష్, డాక్టర్ పెబ్బేటి మల్లికార్జున ముదిరాజ్, మట్టపల్లి వెంకట రమణ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశ్రీశ్రీ ఉత్తర బ్రహ్మ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

హయత్ నగర్ వెలుతురు మే 05:



హయత్ నగర్ లోని ఆర్టీసీ సూపర్వైజర్స్ కాలనీలో శ్రీశ్రీశ్రీ ఉత్తర బ్రహ్మ అభయాంజనేయ స్వామి విగ్రహవాహన ధ్వజస్తంభ ప్రతిష్ట మహాకుంభాభిషేక మహోత్సవ కార్యక్రమాలు ఈనెల 4వ తేదీ నుండి నేటి వరకు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ అధ్యక్షులు బేతన బొట్ల కృష్ణ శర్మ తెలిపారు. ఈ క్రమంలో నేడు అభయాంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠాపన, అభిషేక కార్యక్రమాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పుణ్య మహోత్సవ కార్యక్రమానికి భక్తులు దాతలు తమ వంతు విరాళంగా 10 రూపాయల నుండి లక్ష రూపాయల వరకు అందించడం జరిగిందన్నారు. ఈ పుణ్య కార్యక్రమానికి విరాళాలు అందించిన భక్తులందరిపై ఉత్తర బ్రహ్మ అభయాంజనేయ స్వామి వారి చల్లని ఆశీస్సులు ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ పుణ్య మహోత్సవ కార్యక్రమంలో ఆర్టీసీ సూపర్వైజర్స్ కాలనీ భక్తులే కాకుండా పరిసర ప్రాంతాల భక్తులు కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులు కావాలన్నారు. శ్రీశ్రీశ్రీ జగద్గురు ఆదిశంకరాచార్య హంపి విరూపాక్ష పీఠాధిశ్వరులు శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతి మహాస్వామి వారు కార్యక్రమానికి విచ్చేసి నారాయణ స్మరణ పూర్వక ఆశీర్వచనములను ప్రసాద వితరణ చేస్తారని, నేడు ఉదయం 3 గంటలకు బ్రాహ్మీ ముహూర్తమున గురువుగారి కర కమలములతో ఆంజనేయ స్వామి యంత్ర స్థాన, ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి తుర్కపల్లి సూర్య ప్రకాష్ చారి, ఉపాధ్యక్షురాలు నూకల శాంత కుమారి, సహాయ కార్యదర్శి తుర్కపల్లి సదానంద చారి, కోశాధికారి జాటోత్ విజయ, కార్యవర్గ సభ్యులు తుర్కపల్లి మాధవి, అనిత కుమారి, ఆర్టీసీ సూపర్వైజర్స్ కాలనీ అధ్యక్షులు శంబాల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ జన్మదిన సందర్భంగా
# శుభాకాంక్షలు తెలిపిన జి రామన్ గౌడ్



హైదరాబాద్ వెలుతురు మే 05:

కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ ఎంపీ, మాజీ డిసిసి అధ్యక్షులు అంజన్ కుమార్ యాదవ్ పుట్టినరోజు సందర్భంగా హిమాయత్ నగర్ డివిజన్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు జి.రామన్ గౌడ్ వారిని కలిసి శుభాకాంక్షలు తెలపడం జరిగింది. వారితోపాటు సీతారాం రెడ్డి, భూమన్న యాదవ్, నరేందర్ రెడ్డి, రణధీర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సాదా బైనామా, భూ భారతి పెండింగ్ అప్లికేషన్లను పరిశీలించిన అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి

మేడ్చల్ జిల్లా వెలుతురు మే 05:



ఘట్కేసర్ మెట్రో న్యూస్: జిల్లాలోని ఘట్‌కేసర్ మండలం తహసీల్దార్ ఆఫీస్‌ను మంగళవారం కీసర ఆర్డిఓ రాజేష్ కుమార్ తో కలిసి మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ ) విజయేందర్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సాదా బైనామా, భూ భారతి పెండింగ్ అప్లికేషన్లను పరిశీలించి పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దారును ఆదేశించారు. తెలంగాణ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన భూమి రికార్డుల సమగ్ర పోర్టల్ భూభారతి లో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి సూచనలు జారీ చేసారు. పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పెండెన్సికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. సాదా బైనామా, భూభారతి రికార్డులను అదనపు కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఘట్కేసర్ తహసీల్దారు చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

# ముందస్తుగా 50 నుంచి 60 శాతం ఫీజు చెల్లించాలనే ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు, కాలేజీల గుర్తింపు రద్దు చేయండి

- **ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి లేఖ రాసిన బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్**

హైదరాబాద్ వెలుతురు మే 05:



అడ్మిషన్ల ప్రారంభం రోజే విద్యార్థుల దగ్గర నుండి 50 శాతం నుంచి 60 శాతం ఫీజులను బలవంతంగా వసూలు చేసే కార్పొరేట్ పాఠశాలలు మరియు కాలేజీల గుర్తింపు రద్దు చేయాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి లేఖ రాశారు.ఈ సందర్భంగా కార్పొరేట్ విద్యాసంస్థలు చేస్తున్న దోపిడీ గురించి లింగంగౌడ్ ధ్వజమెత్తారు.కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు విద్యార్థుల మరియు వారి తల్లిదండ్రుల రక్తాన్ని తాగుతూ బతుకుతున్నారని,ఏ మాత్రం కనికరం లేకుండా ధనార్జనే ధ్యేయంగా ఒక పెట్టుబడిదారీ వ్యవస్థలాగా తయారై పట్టి పీడిస్తుందన్నారు. ప్రభుత్వం అన్న విద్యాశాఖ అధికారులన్న కనీసం భయం లేకుండా ఉందన్నారు. పేద పిల్లల తల్లిదండ్రులను వేధించే యాజమాన్యాలకు ఉసురు తగులుతుందని లింగం గౌడ్ అన్నారు.

# భువనగిరి పట్టణ కేంద్రంలో మే 8, 9, 10 తేదీలలో మెగా జాబ్ మేళా



- **కుంభం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళా పోస్టర్‌ను హోటల్ వివేరాలో ఘనంగా ఆవిష్కరించిన నాయకులు**

భువనగిరి, మే 5(వెలుతురు న్యూస్ ):

భువనగిరి పట్టణ కేంద్రంలో మే 8, 9, 10 తేదీలలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి గారి కుంభం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళా పోస్టర్‌ను హోటల్ వివేరాలో ఘనంగా ఆవిష్కరించారు,
ఈ కార్యక్రమంలో భువనగిరి పార్లమెంటు సభ్యులు శ్రీ చామల కిరణ్ కుమార్ రెడ్డి , డీసీసీ యాదాద్రి భువనగిరి అధ్యక్షుడు & ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల ఐలయ్య , నకిరేకల్ నియోజకవర్గం ఎమ్మెల్యే (ప్రభుత్వ విప్) శ్రీ వేముల వీరేశం గారు, తుంగతుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే శ్రీ మందుల శామ్యూల్ గారు, ఎమ్మెల్సీ శ్రీ శంకర్ నాయక్ , డీసీసీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శ్రీ నర్సింహారెడ్డి గారు, డీసీసీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు శ్రీ గుడిపాటి నర్సయ్య , డీసీసీ జనగాం జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి దమయంతి గారు పాల్గొన్నారు.
అలాగే జిల్లా గ్రంథాలయ చైర్మన్, జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్, మున్సిపల్ చైర్మన్,వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, మండల మరియు గ్రామాల ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఈ మెగా జాబ్ మేళా ఎంతో ఉపయోగపడుతుందని, ఎక్కువ మంది యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

# విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ – మునుగోడు లయన్స్ క్లబ్

- **ప్రెసిడెంట్ ఎంజేఎఫ్ లయన్ నారబోయిన రవి**

**మునుగోడు మే 05(వెలుతురు న్యూస్):**

మంగళవారం రోజున మునుగోడు మండల కేంద్రంలోని MSR ఫంక్షన్ హాల్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ మునుగోడు ఆధ్వర్యంలో అధ్యక్షులు ఎంజేఎఫ్ లయన్ నారబోయిన రవి అధ్యక్షతన బీద విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాని



కి ముఖ్య అతిథులుగా చండూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీ టి. రాములు, మునుగోడు తహశీల్దార్ శ్రీ. నేలపట్ల నరేష్, మునుగోడు ఎస్సై శ్రీ.ఈరిగి రవి, కనగల్ ఎస్సై శ్రీ .రాజీవ్ రెడ్డి, చండూరు ఎస్సై శ్రీ. శివకుమార్, మునుగోడు సర్పంచ్ శ్రీమతి పాలకూరి రామాదేవి హాజరై విద్యార్థినులకు సైకిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల విద్యార్థినులు విద్యలో మరింత ముందుకు సాగేందుకు ఇటువంటి సేవా కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. లయన్స్ క్లబ్ సమాజ సేవలో ఎల్లప్పుడూ ముందుంటుందని కొనియాడారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు MJF లయన్ నారబోయిన రవి , కార్యదర్శి పాలకూరి నర్సింహ గౌడ్, కోశాధికారి మిర్యాల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు 1 మిర్యాల వెంకన్నతో పాటు సభ్యులు మిర్యాల శ్రీనివాస్, నారబోయిన సుధాకర్, రావిరాల కుమారస్వామి, ఎస్.ఆర్. వెంకటేశ్వర్లు, సీహెచ్. బిక్షమాచారి, సాంబరాజు శ్రీనివాసరావు, కంభంపాటి అరుణ్, పాల్వాయి చెన్నారెడ్డి, బెల్లి సందీప్, బొడ్డు హరిప్రసాద్, సంగిశెట్టి పరమేష్, బండారు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆశ వర్కర్లకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

నార్కట్‌పల్లి, మే 5,(వెలుతురు న్యూస్ ):

ఆశ వర్కర్లకు రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చింతపల్లి బయన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల ప్రాథమిక వైద్య అధికారి డాక్టర్ విజయకుమార్ గారికి వినతి పత్రం అందజేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మార్చి మరియు ఏప్రిల్ నెలల వేతనాలు అందక ఆశ వర్కర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎండాకాలంలో ఖర్చులు పెరిగిన నేపథ్యంలో, కుటుంబ అవసరాలు, ఫంక్షన్లు, పెళ్లిళ్లకు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొన్నదని పేర్కొన్నారు. ఈఎంఐలు చెల్లించడానికి అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 28 వేల మంది ఆశ వర్కర్లు గత 20 సంవత్సరాలుగా పేద ప్రజలకు సేవలందిస్తున్నప్పటికీ, వారికి ఇప్పటివరకు స్థిర వేతనం కూడా ప్రభుత్వం ఖరారు చేయలేదని విమర్శించారు. కనీసం



ఇకనైనా ప్రభుత్వం స్పందించి, ప్రతి నెల 1వ తేదీకి వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఆశ వర్కర్లకు నెలకు రూ.26,000 ఫిక్స్డ్ వేతనం నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అనురాధ, సిహెచ్ పద్మ, కవిత, మంగమ్మ, రజిత, లావణ్య, అండాలు, లక్ష్మీ, జానకి, ధనమ్మ, రేణుక, భాగ్యమ్మ తదితర ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

# టీ వీ కే విజయానికి మద్దతుగా... బీమ్ ఆర్మీ ఆధ్వర్యంలో సంబరాలు

నార్కట్ పల్లి, మే 5,(వెలుతురు న్యూస్ ):

తమిళనాట విజయం సాధించిన విజయ్ గారి ఘన విజయాన్ని పురస్కరించుకుని నార్కట్‌పల్లి మండల కేంద్రంలో భీమ్ ఆర్మీ ఆధ్వర్యంలో ఘనంగా విజయోత్సవాలు, సంబరాలు నిర్వహించారు. "విజిల్ విన్నింగ్ సౌండ్" మధ్య యువత ఆనందోత్సాహాలతో కార్యక్రమాన్ని జరిపారు. ఈ సందర్భంగా భీమ్ ఆర్మీ నల్గొండ జిల్లా అధ్యక్షుడు వడ్డేపల్లి నాగరాజు మాట్లాడుతూ, తమిళనాడు రాజకీయాల్లో ఎన్నో దశాబ్దాలుగా కొనసాగుతున్న "ద్రవిడ" ముద్రను చెరిపేస్తూ తమిళగ వెట్రి కళగం (TVK) అధినేత



విజయ్ సరికొత్త చరిత్ర సృష్టించారని అన్నారు. తన పార్టీ పేరులో 'ద్రవిడ' అనే పదాన్ని ఉపయోగించకుండా, ప్రాంతీయత కంటే తమిళ అస్తిత్వం మరియు సమగ్రతకు ప్రాధాన్యం ఇచ్చి ఆయన ముందుకు సాగిన తీరు ప్రజలను ఆకట్టుకుందని పేర్కొన్నారు.

కులమతాలకు అతీతంగా సెక్యులర్ భావజాలంతో ప్రజల మనసు గెలుచుకున్న విజయ్, పాత తరపు రాజకీయాలకు ముగింపు పలుకుతూ యువత ఆశయాలకు ప్రతిరూపంగా నిలిచారని కొనియాడారు. ఒకప్పుడు సినిమా తెరపై గర్జించిన దళపతి, ఇప్పుడు అసెంబ్లీలో ప్రజల గళంగా మారబోతున్నారని అన్నారు.

ఇది కేవలం ఒక గెలుపు మాత్రమే కాకుండా తమిళనాడు రాజకీయాల్లో కొత్త శకం ఆరంభమని, దుర్బలుడు గెలవడమే అసలైన విజయం అని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు, ధర్మ సమాజ్ పార్టీ మండల కన్వీనర్ బోడ లింగస్వామి, పెద్ద మాల మాదాసు నరేష్, 6వ వార్డు సభ్యులు బకరం జనార్దన్, MRPS టౌన్ అధ్యక్షుడు మంద సుధాకర్, పెరమళ్ళ రవి, మంద రవి, లింగాల దేవేందర్, చింత మహేష్, చింత విక్రమ్, చిరుమర్తి ఉపేందర్, మంద ఎల్లయ్య, బోడ ప్రవీణ్, మంద జానీ, కొత్తూరు నవీన్, బోడ చంద్రశేఖర్, బాజ భాను, ముప్పిడి కుమార్, బోడ రాఖీ తదితరులు పాల్గొన్నారు.

# రామన్నపేట ఆసుపత్రిలో నేతన్నకు ఆరోగ్య భద్రత మెగా వైద్య శిబిరం.

రామన్నపేట వెలుతురు మే 05:

స్థానిక పట్టణ కేంద్రంలోని ఏరియా ఆసుపత్రిలో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకై ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నేతన్నకు ఆరోగ్య భద్రత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని రామన్నపేట సర్పంచ్ గరిక సత్యనారాయణ ప్రారంభించారు. ఈ శిబిరంలో ప్రత్యేక వైద్య నిపుణులు జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్,కంటి వైద్యులు తమ వైద్య సేవలను అందించారు. అన్ని రకాల రక్త పరీక్షలు నిర్వహించారు. శ్వాస కోశ లక్షణాలు ఉన్నవారికి ఛాతి ఎక్స్ రేలు కూడా తీశారు. ఈ శిబిరంలో



మొత్తం 75మందికి గాను, 50మంది మగవారికి, 25 మంది స్త్రీలకు వివిధ రకముల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా హాస్పిటల్ సూపరిండెంట్ డాక్టర్ శ్వేతా ప్రియాంక, సర్పంచ్ గరిక సత్యనారాయణ, రామన్నపేట చేనేత సహకార సంఘ అధ్యక్షులు జెల్ల వెంకటేష్, పట్టణ శాఖ అధ్యక్షులు, రచ్చ యాదగిరి, మునిపంపుల వైద్యాధికారి డాక్టర్ అశ్విని కుమార్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుమన్ కళ్యాణ్, హెచ్ఈఓ గోపాల్, సూపర్వైజర్ వాణిశ్రీ, ఏఎన్ఎం లు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

# సిరిపురం దోమలపల్లి నరసింహ కుటుంబానికి బాసటగా నిలిచిన సిపిఎం గ్రామ శాఖ

- **50 వేల రూపాయల చెక్కును అందజేసిన పార్టీ నాయకత్వం**

**రామన్నపేట వెలుతురు మే 05:**

: సిరిపురం సిపిఎం గ్రామ నాయకుడు దోమలపల్లి నర్సింహ ఇటీవల అనారోగ్యంతో మరణించగా సీపీఎం గ్రామ శాఖ బాసటగా నిలవడం జరిగింది. నరసింహ కుటుంబ సభ్యులకు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి నాయకత్వం చేతుల మీదుగా 50వేల రూపాయలు నరసింహ భార్య పేరున ఫిక్సడ్ డిపాజిట్ చేసి చెక్కును అందించటం జరిగింది. తను మరణించిన రోజు అంత్యక్రియలు మొత్తం పార్టీ గ్రామ



శాఖ పెట్టడం జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి మాట్లాడుతూ దోమలపల్లి నరసింహ పార్టీ ప్రజాసంఘాల ఉద్యమంలో కీలక భూమిక పోషించాడని ప్రజల పక్షాన నిరంతరం తాపత్రేయపడేవాడని కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటి సభ్యులు బల్గూరి అంజయ్య, శాఖ కార్యదర్శి అంబటి మల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ బడుగు రమేష్, మాజీ సర్పంచ్ మిరియాల భాస్కర్ నాయకులు కూనూరు వెంకటేశం, మోటే స్వామి, కూనూరు గణేష్, బైరెడ్డి మధుసూదన్ రెడ్డి, సిల్వేరు రాజు, మార్త భూపాల్ రెడ్డి మరియు దోమలపల్లి నర్సింహ కుటుంబ సభ్యులు దోమల పెళ్లి మల్లేశం, లక్ష్మణ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# రైస్ మిల్లులను అకస్మాత్తుగా తనిఖీ చేసిన జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ ) కే.వెంకటరెడ్డి

- **లారీలో ఉన్న బస్తాలను వెంటనే ఖాళీ చేయించండి**

**రామన్నపేట వెలుతురు మే 05:**

రామన్నపేట మండలంలోని ఇంద్రపాలనగరం విద్యా ఆగ్రో రైస్ మిల్లును తనిఖీ చేశారు. మరియు జనంపల్లి లో ఉన్న సాయి శ్రీ రైస్ మిల్లు కూడా సందర్శించారు. ఇట్టి మిల్లులో ఉన్నటువంటి లారీలను వెంటవెంటనే ఖాళీ చేయించి తిరిగి సెంటర్లకు పంపవలసిందిగా మిల్లుల యాజమాన్యం వారిని ఆదేశించినారు . మిల్లు వద్ద సరిపోను హమాలీలను, ఏర్పాట్లను వెంటనే పెంపొందించి త్వరితంగా లారీలను ఖాళీ చేయించి మండలంలోని రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుం



డా చూడ వలసినదిగా ఆదేశించినారు. వీరి డి ఎం సి ఎస్ హరి కేషన్. డి సి ఎస్ ఓ ఎ.రోజా.



తాసిల్దార్ డిటిసిఎస్ బాలమణి. కే. సురేందర్ రెడ్డి, ఆర్ ఐ శోభ జిపి ఓఎస్ అన్నారు.

# గర్దాస్ జనమ్మ మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించిన సర్పంచ్ గర్దాస్ విక్రమ్



**రామన్నపేట వెలుతురు మే 05:**

ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన గర్దాస్ జనమ్మ "ఆకస్మికంగా గుండెపోటుతో మృతిచెందడం జరిగింది. వారి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన సర్పంచ్ గర్దాస్ విక్రమ్. ఈ కార్యక్రమంలో యువ నాయకుడు సింగనబోయిన గణేష్,సీనియర్ నాయకులు మంటి లింగస్వామి, రాస వెంకటేశం, గొల్లపల్లి యాదయ్య, నక్క వెంకటేశం, కోమ్మగోని రమేష్, మేకల నరేష్, గడ్డం సాయి, గర్దాస్ శ్రీకాంత్, గర్దాస్ సాయి, గర్దాస్ చింటూ, తదితరులు పాల్గొనడం జరిగింది.

# వంగాల యమున శ్రీ కుటుంబ సభ్యులని పరామర్శిం-చిన.. మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



**నార్కట్ పల్లి , మే 5 వెలుతురు న్యూస్:**

నార్కెట్‌పల్లి మండలం చిన్నతుమలగూడెం గ్రామ శాఖ అధ్యక్షులు వంగాల నరసింహ కోడలు వంగాల యమున శ్రీ దురదృష్టవశాత్తు జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించడం తీవ్ర విషాదాన్ని కలిగించింది.

ఈ విషాద ఘటన నేపథ్యంలో నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి పట్ల తన సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కష్టకాలంలో ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు సూచిస్తూ, వారికి మానసికంగా అండగా నిలిచారు.

యమున శ్రీ ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ అపారమైన లోటును భరించే శక్తి కలగాలని ప్రార్థించారు.

# అంగన్వాడి కేంద్రంలో ఆరోగ్యలక్ష్మి–టిహెచ్ఆర్ పంపిణీ కార్యక్రమం

**గుండాల , మే 5 వెలుతురు న్యూస్:**

యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం గంగాపురం గ్రామంలో అంగన్వాడి కేంద్రంలో ఆరోగ్యలక్ష్మి మరియు టేక్ హోమ్ రేషన్ (టిహెచ్ఆర్) పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ కాలి మంజుల ఆంజనేయులు ముఖ్య అతిథిగా హాజరై, గర్భిణీ స్త్రీలు మరియు చిన్నారులకు రేషన్‌ను పంపిణీ చేశారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని, గర్భిణీ స్త్రీలు మరియు అంగన్వాడి పిల్లలకు పోషకాహారం అందేలా ముందస్తు చర్యగా ఇంటి వద్దకే టిహెచ్ఆర్ అందజేయడం జరుగుతుందని సర్పంచ్ తెలిపారు. పిల్లల ఆరోగ్యం, గర్భిణీ స్త్రీల పోషణ మెరుగుపడేందుకు ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని ఆయన పేర్కొన్నారు.



ఈ సందర్భంగా అంగన్వాడి సిబ్బంది మాట్లాడుతూ, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సరైన సమయంలో రేషన్ అందించేలా కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అంగన్వాడి కార్యకర్త చంద్రగిరి లక్ష్మి,, సహాయకులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు

# కాలువల నిర్లక్ష్యం... వృథా అవుతున్న సాగునీరు





**మునుగోడు , మే 5 వెలుతురు న్యూస్:**

మునుగోడు మండలం పలివెల–చీకటిమామిడి గ్రామాల మధ్య ఉన్న చెక్‌డ్యామ్,ఫీడర్ చానల్‌ను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి మంగళవారం పరిశీలించారు.కాలువల నిర్లక్ష్యం వల్ల సాగునీరు మధ్యలోనే వృథా అవుతుందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. కాలువలు సరిగా లేకపోవడంతో సుమారు 8 గ్రామాలకు నీరు అందడం లేదన్నారు. ఫీడర్ చానల్ గేట్లు దెబ్బతినడం,నీటి ప్రవాహం తగ్గడం సమస్యలను తీవ్రతరం చేస్తున్నాయని తెలిపారు. కాలువల్లో కంప చెట్లు పెరగడంతో నీరు దారి మళ్లి చెరువులు ఎండిపోతున్నాయని, స్వల్ప మరమ్మత్తులతో సమస్య పరిష్కారం సాధ్యమని సూచించారు.ప్రభుత్వం వెంటనే స్పందించి కాలువలు, గేట్లు దిద్దుబాటు చేసి నీటి వృథాను నివారించాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కాలువ పనులు పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మారగొని అంజయ్య గౌడ్,మేకల శ్రీనివాస్ రెడ్డి, పాల్వాయి వెంకట్ రెడ్డి,గజ్జల బాలరాజు గౌడ్,జిట్టగోని మల్లేష్, బొమ్మగోని లింగస్వామి,మార్తా మోహన్ రెడ్డి,ఐతగోని విజయ్,నాతి లింగస్వామి ,బైరు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# కోహిర్‌లో భారీ గ్యాస్ సిలిండర్ల దొంగతనం

- 82 సిలిండర్లు ఎత్తుకెళ్లిన దుండగులు...
- గోదాం తాళాలు పగలగొట్టి చోరీ • సీసీ కెమెరాలు ధ్వంసం...
- భారీ వాహనంతో తరలింపు • పోలీసుల దర్యాప్తు ముమ్మరం...



**జహీరాబాద్ వెలుతురు మే 05:**

వంటగ్యాస్ కొరతతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న వేళ సంగారెడ్డి జిల్లా కోహిర్ పట్టణంలో భారీ గ్యాస్ సిలిండర్ల దొంగతనం కలకలం రేపింది. కోహిర్‌లోని మనీషా ఇండియన్ గ్యాస్ గోదాంలో అర్ధరాత్రి చొరబడిన దుండగులు తాళాలు పగలగొట్టి మొత్తం 82 సిలిండర్లు ఎత్తుకెళ్లారు. ఇందులో 51 భర్తీ సిలిండర్లు, 31 ఖాళీ సిలిండర్లు ఉన్నట్లు అధికారులు తెలిపారు. చోరీ ఘటనను రికార్డు కాకుండా చేయాలనే ఉద్దేశంతో గోదాంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను దుండగులు ధ్వంసం చేశారు. గోదాం పరిసరాల్లో భారీ వాహనాన్ని నిలిపి, అక్కడి నుంచి సిలిండర్లను బైకులపై తరలించినట్లు ప్రాథమిక విచారణలో పోలీసులు గుర్తించారు. సమాచారం అందుకున్న జహీరాబాద్ సీఐ శివలింగం, కోహిర్ ఎస్ఐ నరేష్‌తో పాటు సంగారెడ్డి సీసీఎస్ పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, నిందితులను పట్టుకునేందుకు పోలీసులు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు ముమ్మరం చేశారు.

# జహీరాబాద్‌లో విద్యార్థిని అదృశ్యం

**జహీరాబాద్ వెలుతురు మే 05:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని నగుల్కట్ట ప్రాంతానికి చెందిన తమ్మలి సంగమేశ్వర్ (52), వృత్తి కండక్టర్, తన రెండవ కుమార్తె తమ్మలి రాధిక (20), విద్యార్థిని అదృశ్యమైనట్లు జహీరాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ప్రకారం, మే 4వ తేదీ రాత్రి సుమారు 7 గంటల సమయంలో రాధిక స్నేహితుల ఇంటికి వెళ్తున్నట్లు చెప్పి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఆమె కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితులు మరియు పరిచయస్తుల వద్ద వెతికినా ఎక్కడా ఆచూకీ లభించలేదు. దీంతో ఆందోళన చెందిన తండ్రి సంగమేశ్వర్ పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన జహీరాబాద్ టౌన్ సబ్ఇన్‌స్పెక్టర్ కె. వినయ్ కుమార్ దర్యాప్తు ప్రారంభించారు. యువతి ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.




# శ్రీ సాయి చైతన్య విద్యా కుసుమాలకు ఘన సన్మానం





**నారాయణఖేడ్ వెలుతురు మే 05:**

మెదక్ జిల్లా : నారాయణఖేడ్ నియోజకవర్గం శంకరంపేట్ మండలంలోని శ్రీ సాయి చైతన్య స్కూల్ స్టూడెంట్స్ ఇటీవల విడుదలైన టెన్త్ క్లాస్ రిజల్ట్ లో ఉత్తమ ఫలితాలు సాధించిన స్టూడెంట్స్ ను, మెదక్ జిల్లా టాపర్ గా నిలిచిన ప్రణతిని స్కూల్ మేనేజ్మెంట్, శంకరంపేట మాజీ ఎంపీపీ, మాజీ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్, పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, హై స్కూల్ స్టాఫ్ మంగళవారం స్కూల్ క్యాంపస్ లో ప్రత్యేకంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ సాయి చైతన్య స్కూల్లో చదువుకున్న స్టూడెంట్స్ ఇప్పటికే అనేక రంగాల్లో ఉన్నత స్థానంలో ఉన్నారని, గత 15 సంవత్సరాల నుండి శంకరంపేటలో చక్కటి విద్యాబోధన అందిస్తూ పిల్లల్ని అన్ని రంగాల్లో అద్భుతంగా తీర్చిదిద్దుతున్న మేనేజ్మెంట్ కు పేరెంట్స్,శంకరంపేట మండల ప్రజల సహకారం అద్భుతంగా ఉందని కొనియాడారు.విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పాటు చేసుకొని వాటి సాధన కోసం నిరంతరం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ గంగాధర్ గౌడ్,భూమేశ్వర్ గౌడ్, స్కూల్ స్టాప్, స్టూడెంట్స్ పాల్గొన్నారు.

# స్మార్ట్ సిటీ బోర్డు సమావేశంలో పాల్గొన్న మేయర్ కోలగని శ్రీనివాస్





**కరీంనగర్ వెలుతురు మే 05:**

హైదరాబాదులో మంగళవారం రోజున మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ & అర్బన్ డెవలప్మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ అధ్యక్షతన జరిగిన కరీంనగర్ స్మార్ట్ సిటీ ఎస్ పి వి బోర్డు సమావేశంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొన్నారు. మొట్ట మొదటి సారిగా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీ డాక్టర్ టి . కె శ్రీదేవిని కలిసి పూలమొక్క అందజేశారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... స్మార్ట్ సిటీ నిధుల కింద ₹70 కోట్లతో ప్రతిపాదించిన అభివృద్ధి పనులను బోర్డు ఆమోదించిందన్నారు. ఈ నిధులతో నగరంలో మల్టీపర్పస్ పార్కింగ్ వ్యవస్థ మరియు పలు ప్రాంతాల్లో వరద కాలువ సమస్యల నివారణకు చేపట్టే పనులను ప్రతిపాదించామని పేర్కొన్నారు. అలాగే అర్బన్ చాలెంజ్ ఫండ్ యు సి ఎఫ్ కేంద్ర ప్రభుత్వ స్కీం ద్వారా చేపట్టే వివిధ అభివృద్ధి పనులు, విధివిధానాలపై చర్చించడం జరిగిందని తెలిపారు. సమావేశంలో జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్, సీపీ, ఇంజినీర్ఇన్‌చీఫ్, డిటిపిసి కార్పొరేషన్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

# జహీరాబాద్‌లో ఆయిల్ పామ్ సాగుపై విస్తృత అవగాహన కార్యక్రమం

- ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా రైతులకు సాంకేతిక మార్గదర్శకం, సబ్సిడీలపై వివరాలు

**జహీరాబాద్ వెలుతురు మే 05:**





తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా జహీరాబాద్ నియోజకవర్గంలోని షెట్‌కార్ ఫంక్షన్ హాల్‌లో ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి, సీడీసీ చైర్మన్ మహమ్మద్ అబ్దుల్ మొబిన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రామలింగారెడ్డి మాట్లాడుతూ, ఆయిల్ పామ్ పంట రైతులకు అధిక ఆదాయం అందించే పంటగా మారుతోందని,సరైన పద్ధతులు పాటిస్తే ఎక్కువ దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. రైతులు ప్రభుత్వ సూచనలను పాటిస్తూ శాస్త్రీయ విధానాల్లో సాగు చేపట్టాలని సూచించారు. వ్యవసాయ శాఖ డిఏఓ శివప్రసాద్ మాట్లాడుతూ, ఆయిల్ పామ్ సాగులో పాటించాల్సిన ముఖ్య మెలుకువలు, నీటి నిర్వహణ, ఎరువుల వినియోగం వంటి అంశాలను వివరించారు. సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాలు ఈ పంట సాగులో ముందంజలో ఉన్నాయని, అక్కడి రైతులు తమ ఉత్పత్తిని సమర్థవంతంగా మార్కెట్ చేస్తున్నారని తెలిపారు. జహీరాబాద్ డివిజన్ ఏడిఏ భిక్షపతి, ఇతర వ్యవసాయ అధికారులు కూడా రైతులకు మార్గదర్శనం చేశారు. కేవీక్ శాస్త్రవేత్త స్నేహలత కూరగాయల సాగుపై అవగాహన కల్పించగా, ఎఫ్ఆర్ఎస్ శాస్త్రవేత్త నవీన్ ఆధునిక పద్ధతులపై వివరించారు. న్యాల్కల్ మండలానికి చెందిన భాస్కర్ రెడ్డి రైతుల అనుభవాలను పంచుకున్నారు. ఉద్యాన శాఖ హార్టికల్చర్ ఆఫీసర్ పండరి మాట్లాడుతూ, ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, పథకాలపై సమగ్ర వివరాలు తెలియజేశారు. హార్టికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ విట్టల్ కూడా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కోహీర్, ఝరాసంగం, న్యాల్కల్, జహీరాబాద్, మొగుడంపల్లి ప్రాంతాల అగ్రికల్చర్ ఆఫీసర్లు, ఏవోలు, ఏఈవోలు పాల్గొన్నారు. అలాగే వివిధ గ్రామాల నుండి రైతులు, గోద్రెజ్ కంపెనీ ప్రతినిధులు, డ్రిప్ ఇరిగేషన్ కంపెనీల ప్రతినిధులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా రైతులకు ఆయిల్ పామ్ సాగుపై పూర్తి స్థాయి అవగాహన కల్పించామని అధికారులు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అధిక లాభాలు పొందాలని సూచించారు.

# కవేలి గ్రామంలో భూసార పరీక్షలు, సమతుల్య ఎరువుల యాజమాన్యంపై అవగాహన

- రైతులకు శాస్త్రీయ పద్ధతుల్లో మట్టి నమూనా సేకరణ, ఎరువుల వినియోగంపై మార్గదర్శనం

**జహీరాబాద్ వెలుతురు మే 05:**




సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలంలోని కవేలి గ్రామంలో డీడీఎస్-కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో భూసార పరీక్షలు మరియు సమతుల్య ఎరువుల యాజమాన్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో భూసార పరీక్ష నిపుణులు ఈ. స్వామి రైతులకు శాస్త్రీయ పద్ధతులపై వివరంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూసార పరీక్ష అనేది నేలలోని పోషకాలు, pH స్థాయి, లవణీయత వంటి అంశాలను అంచనా వేసే ముఖ్యమైన ప్రక్రియ అని తెలిపారు. పంటల సాగుకు ముందు భూమి పరిస్థితిని తెలుసుకోవడం ద్వారా సరైన ఎరువుల వినియోగం సాధ్యమవుతుందని చెప్పారు. భూసార పరీక్షల ద్వారా పోషక లోపాలను గుర్తించి, తగిన మోతాదులో ఎరువులు వాడడం వల్ల పంటల దిగుబడి మరియు నాణ్యత పెరుగుతాయని వివరించారు. రైతులు క్రమం తప్పకుండా భూసార పరీక్షలు చేయించుకొని, పరీక్షా నివేదికల ఆధారంగా ఎరువులను వినియోగించాలని సూచించారు. మట్టి నమూనా సేకరణ విధానంపై కూడా ఆయన స్పష్టమైన మార్గదర్శనం చేశారు. వేసవి కాలంలో పంటలు లేని సమయంలో నమూనాలు సేకరించడం ఉత్తమమని పేర్కొన్నారు. ఒక ఎకరానికి 6-8 ప్రదేశాల నుండి నమూనాలు సేకరించి, పొలంలో జిగ్‌జాగ్ పద్ధతిలో తిరుగుతూ 15-30 సెం.మీ. లోతు వరకు తవ్వి మట్టిని తీసుకోవాలని వివరించారు. సేకరించిన మట్టిని బాగా కలిపి నాలుగు భాగాలుగా చేసి, ఎదురుభాగాలను తొలగించి మిగిలిన మట్టితో తుది నమూనా సిద్ధం చేయాలని తెలిపారు. ఆ నమూనాను గుడ్డ సంచి లేదా ప్లాస్టిక్ కవర్‌లో ఉంచి రైతు వివరాలతో లేబుల్ చేసి భూసార పరీక్ష కేంద్రానికి పంపితే నివేదిక అందుతుందని చెప్పారు. కార్యక్రమం అనంతరం సమీప పొలంలో మట్టి నమూనా సేకరణ విధానాన్ని ప్రత్యక్షంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పిరమల్ ఫౌండేషన్ రీసెర్చ్ ఫెలోషిప్ విద్యార్థులు మహమ్మద్ ఆరిఫ్, మమత మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# హిందూ ధర్మ పరిరక్షణ కోసం ఐక్యతతో ముందుకు కొనసాగాలి

- బూరుగుపల్లి హిందూ సమ్మేళనంలో సురేష్ ఆత్మ రామ్ గురూజీ

**కరీంనగర్ వెలుతురు మే 05:**





తెలంగాణ రాష్ట్రంలో పేద, మధ్యతరగతి, దళిత, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు ఎన్నో సంవత్సరాలుగా ఆర్థికంగా అండగా నిలుస్తున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ మరియు స్కాలర్‌షిప్ పథకాలపై ప్రభుత్వం తీసుకువచ్చిన జి.ఓ. నెం 7 తీవ్ర ప్రభావం చూపుతుందని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై. నరోత్తం ఆందోళన వ్యక్తం చేశారు. జి.ఓ. నెం 7 ద్వారా ఈ పథకాలను నిర్వీర్యం చేసే ప్రయత్నం జరుగుతోందని, దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది పేద విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిలిచిపోయే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే కళాశాలలు ఫీజుల బకాయిల పేరుతో విద్యార్థులపై ఒత్తిడి తెస్తూ, సర్టిఫికెట్లు, హాల్ టికెట్లు నిలిపివేస్తున్నాయని తెలిపారు. ఈ పరిస్థితుల వల్ల విద్యార్థులు మానసికంగా తీవ్ర వేదనకు గురవుతున్నారని పేర్కొన్నా. ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త విధానం ప్రకారం ముందుగా విద్యార్థులే ఫీజులు చెల్లించి, తర్వాత ప్రభుత్వం చెల్లిస్తామన్న విధానం అమలు చేయడం పేదలకు భారంగా మారిందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలలో జరుగుతున్న తీవ్ర జాప్యం కారణంగా అనేక మంది విద్యార్థులు ఉన్నత విద్యను మధ్యలోనే మానేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది పరిపాలనా సంస్కరణ కాదని, పేద విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడటమేనని ఆయన విమర్శించారు. ప్రభుత్వానికి నిజంగా పేద విద్యార్థులపై శ్రద్ధ ఉంటే, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ మరియు స్కాలర్‌షిప్ బకాయిలన్నింటిని వెంటనే విడుదల చేసి, జి.ఓ. నెం 7ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్, శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు..

# ప్రతిభావంతులైన పేద విద్యార్థుల చేయూత కోసం 'కపిల్ విద్యా వారధి' (సంక్షేమ ట్రస్ట్)

- దరఖాస్తుకు ఆఖరు తేది మే 15 , 20న అర్హత పరీక్ష

**కరీంనగర్ వెలుతురు మే 05:**



పదో తరగతి పూర్తి చేసుకుని, ఆర్థిక ఇబ్బందుల వల్ల పై చదువులకు దూరమవుతున్న ప్రతిభావంతులైన విద్యార్థులను ఆదుకోవడానికి చేయూతనందించడానికి "కపిల్ విద్యా వారధి" (సంక్షేమ ట్రస్ట్) ముందుకొచ్చింది. పదవ తరగతి ప్రభుత్వ పాఠశాలల్లో (2025 26) విద్యా సంవత్సరంలో విద్యను అభ్యసించి , 520 మార్కులు సాధించిన విద్యార్థులు తమకు ఇష్టమైన రంగంలో స్థిరపడే వరకు అయ్యే ఖర్చులతో పాటు, వారికి మానసిక ధైర్యాన్ని, నైపుణ్యాన్ని అందించడమే కపిల్ విద్యా వారధి సంక్షేమ ట్రస్ట్ ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.ఈ పథకం కింద లబ్ధి పొందాలనుకునే విద్యార్థులకు కరీంనగర్లోని సరస్వతి శిశు మందిర్లో మే 20 న అర్హత పరీక్ష ఉదయం 10గంటల నుండి 12 గంటల వరకు ఉంటుందని తెలిపారు. అర్హత పరీక్ష .పదో తరగతి సిలబస్ (గణితం, ఫిజికల్ సైన్స్, బయోసైన్స్ & ఇంగ్లీష్) ఆధారంగా ప్రశ్నపత్రం కేవలం ఇంగ్లీష్ మీడియంలోనే ఉంటుందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు లేని వారు, సింగిల్ పేరెంట్ పిల్లలుఆర్థికంగా వెనుకబడిన వారికి ప్రాధాన్యత ఉంటుందని, కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, నిజామాబాద్, కామారెడ్డి, ఆదిలాబాద్, కొమరం భీమ్ ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, వరంగల్ (వరంగల్ అర్బన్), హన్మకొండ (వరంగల్ రూరల్), జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, జనగామ, ములుగు, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి, అర్హతా పరీక్ష రాయడానికి అర్హులు అని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు మే 15 లోపు www. kapilvidyavaradhi.org వెబ్‌సైట్ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు అప్పిడి రాజిరెడ్డి: 98485 26865 గీకురు శ్రీనివాస్: 99854 82292 లను చరవాణి నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

# జహీరాబాద్‌లోని పస్తాపూర్ ఫ్లైఓవర్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- దర్శనానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం..
- ఇద్దరు యువకులు మృతి... నలుగురికి తీవ్ర గాయాలు...

**జహీరాబాద్ వెలుతురు మే 05:**





సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణ శివారులోని జాతీయ రహదారి-65పై మంగళవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం కేసారం గ్రామానికి చెందిన కాసుల మహేష్ గౌడ్ (27) తన స్నేహితులు, బంధువులతో కలిసి మహారాష్ట్రలోని తుల్జాపూర్ భవానీ మాత ఆలయ దర్శనానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో ఉండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, జహీరాబాద్ సమీపంలోని పస్తాపూర్ ఫ్లైఓవర్ వద్ద రోడ్డుపై నిలిపి ఉంచిన టాటా ట్రాలీ ఆటోను వెనుక నుంచి వస్తున్న వెన్యూ కారు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ముందు సీట్లో ఉన్న మహేష్ గౌడ్, వెనుక సీట్లో ప్రయాణిస్తున్న మైలాపురం రోహిత్ కుమార్ (17) తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. కారులో ప్రయాణిస్తున్న నాంపల్లి కార్తీక్ (27), ఆతేంద్ర సాయి (9), నితిన్ గౌడ్ (6), కె. నర్సింలు (32) తీవ్రంగా గాయపడగా, వారిని తక్షణమే హైదరాబాద్‌లోని కాంటినెంటల్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదానికి ట్రాలీ ఆటో డ్రైవర్ ఎలాంటి హెచ్చరిక సూచనలు లేకుండా వాహనాన్ని రోడ్డుపై నిర్లక్ష్యంగా నిలిపివేయడమే కారణమని ప్రాథమిక విచారణలో పోలీసులు వెల్లడించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి కాసుల సుదర్శన్ గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, సబ్ఇన్‌స్పెక్టర్ కె. వినయ్ కుమార్ దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతానికి కృషి





**సంగారెడ్డి వెలుతురు మే 05**: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అన్ని వర్గాల ప్రజల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పష్టం చేశారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మంగళవారం జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జోగిపేట ఆందోల్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరామ గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాబోయే రోజుల్లో అన్ని అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంగన్వాడీ టీచర్లు, సూపర్వైజర్లు, ఆయాలు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఎక్కడైనా నిర్లక్ష్యం, బాధ్యతా రాహిత్యం కనబడితే ప్రభుత్వం ఉపేక్షించబోదని స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం విద్య, వైద్యం, మహిళా సాధికారత, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. అదేవిధంగా, అంగన్వాడీ టీచర్లు, ఆయాల ఖాళీ పోస్టులను భర్తీ చేస్తామని మంత్రి తెలిపారు. ప్రజలకు ఎక్కడైనా సమస్యలు ఎదురైతే వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం ఈ కార్యక్రమంలో మంత్రి 10 మంది దివ్యాంగులకు ఉచిత స్కూటీలు, 286 మంది అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, అడిషనల్ కలెక్టర్ పాండు, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి లలిత కుమారి, సిడిపిఓలు, అంగన్వాడీ సూపర్వైజర్లు, టీచర్లు, దివ్యాంగులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

# విశాఖ కేంద్రంగా దక్షిణకోస్తా రైల్వే జోన్




**విశాఖపట్నం వెలుతురు మే 05**: విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు చేస్తూ కేంద్ర రైల్వే శాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కీలక మైలురాయిగా మారింది. ఈ నిర్ణయంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేస్తూ, ఇది రాష్ట్ర ప్రజల చిరకాల స్వప్నం నెరవేరినట్టేనని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో తన అభిప్రాయాలను వెల్లడించారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుతో రాష్ట్రానికి కొత్త అభివృద్ధి అవకాశాలు తెరుచుకుంటాయని సీఎం అభిప్రాయపడ్డారు. 2026 జూన్ 1వ తేదీ నుంచి విశాఖపట్నం కేంద్రంగా ఈ జోన్ అధికారిక కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. ఈ నిర్ణయం ద్వారా రైల్వే పరిపాలనలో వికేంద్రీకరణ జరిగి, స్థానిక అవసరాలకు అనుగుణంగా వేగవంతమైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

వాల్తేరు డివిజన్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా పలాస-ఇచ్ఛాపురం వంటి కీలక రైల్వే సెక్షన్లను విశాఖ డివిజన్‌లో విలీనం చేయడం ద్వారా ఉత్తరాంధ్ర రవాణా రంగానికి కొత్త దిశ ఏర్పడుతుందని సీఎం వివరించారు. ఈ మార్పులతో ప్రయాణికులకు మెరుగైన సేవలు అందుబాటులోకి రావడంతో పాటు సరుకు రవాణా వ్యవస్థ కూడా మరింత సమర్థవంతంగా మారుతుందని భావిస్తున్నారు. కొత్తగా ఏర్పాటైన విశాఖ డివిజన్, రాయగడ డివిజన్ల మధ్య సమన్వయం పెరగడం ద్వారా రైల్వే వ్యవస్థ బలోపేతం అవుతుందని సీఎం తెలిపారు. ఈ సమన్వయం వల్ల ప్రాంతీయ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రైలు మార్గాలు, సేవలను అభివృద్ధి చేసే అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రాంతానికి ఇది ఒక పెద్ద ఊతంగా మారనుందని అన్నారు. ఈ జోన్ ఏర్పాటు రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి కూడా దోహదపడుతుందని సీఎం అభిప్రాయపడ్డారు. విశాఖపట్నం ఇప్పటికే ఒక ప్రధాన పారిశ్రామిక, పోర్ట్ నగరంగా ఉన్న నేపథ్యంలో రైల్వే జోన్ ఏర్పాటు వల్ల పెట్టుబడులు మరింతగా ఆకర్షితమయ్యే అవకాశం ఉందన్నారు. సరుకు రవాణా సౌకర్యాలు మెరుగుపడటం వల్ల పరిశ్రమల స్థాపనకు అనుకూల వాతావరణం ఏర్పడుతుందని చెప్పారు. ఉత్తరాంధ్రలో రైల్వే కనెక్టివిటీ మెరుగుపడటం వల్ల ప్రాంతీయ సమగ్ర అభివృద్ధికి ఇది దోహదపడుతుందని సీఎం తెలిపారు. గ్రామీణ ప్రాంతాలు, చిన్న పట్టణాలు కూడా మెరుగైన రవాణా సదుపాయాలను పొందగలవని పేర్కొన్నారు. దీనివల్ల ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ఆర్థిక కార్యకలాపాలు విస్తరించే అవకాశముందని అన్నారు. ఈ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న కేంద్ర ప్రభుత్వానికి సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మరియు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్ర విజ్ఞప్తిని గౌరవించి ఈ నిర్ణయం తీసుకున్నందుకు అభినందనలు తెలిపారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు ద్వారా ఆంధ్రప్రదేశ్ రైల్వే రంగంలో కొత్త అధ్యాయం ప్రారంభమవుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇది కేవలం రవాణా రంగానికే కాకుండా రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి దోహదపడే నిర్ణయంగా నిలవనుంది. రాబోయే రోజుల్లో ఈ జోన్ పనితీరు ఎలా ఉంటుందన్నదే కీలకంగా మారనుంది. మొత్తంగా, విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు నిర్ణయం రాష్ట్ర ప్రజల ఆశలను నెరవేర్చినట్టే కాకుండా, భవిష్యత్ అభివృద్ధికి బలమైన పునాదిని ఏర్పాటు చేస్తోందని చెప్పవచ్చు.

# ఓటమి మాకు కొత్త కాదు




**చెన్నై వెలుతురు మే 05**: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో కీలక మార్పులకు దారి తీసిన నేపథ్యంలో ద్రవిడ మున్నేట్ర కళగం (డీఎంకే) అధినేత ఎం.కె. స్టాలిన్ స్పందించారు. ఓటమిని అంగీకరిస్తూనే పార్టీ శ్రేణులకు ధైర్యం చెప్పే విధంగా ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఈ ఎన్నికల ఫలితాల అనంతరం సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో పోస్టు చేస్తూ తన అభిప్రాయాలను వెల్లడించారు. రాజకీయ జీవితం అనేది గెలుపోటములతో కూడిన ప్రయాణమని స్టాలిన్ పేర్కొన్నారు. డీఎంకే పార్టీ ఇప్పటికే ఆరుసార్లు అధికారంలోకి వచ్చిందని గుర్తుచేస్తూ, ఈ ప్రయాణంలో ఎన్నో విజయాలు సాధించామని, అలాగే కొన్ని ఓటములను కూడా ఎదుర్కొన్నామని తెలిపారు. అయితే ఏ పరిస్థితుల్లోనూ పార్టీ తన సిద్ధాంతాలను వదలకూడదని ఆయన స్పష్టం చేశారు. సైద్ధాంతికంగా ఓటమి చవిచూడకుండా ఎల్లప్పుడూ జాగ్రత్త వహించాలని కార్యకర్తలకు సూచించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులను ఉద్దేశించి ఆయన కీలక సందేశం ఇచ్చారు. గెలుపోటములను సమానంగా స్వీకరించగలిగిన వారే నిజమైన కార్యకర్తలని, వ్యక్తిగత ఆశలు కాకుండా పార్టీ సిద్ధాంతాలను ముందుంచుకుని పనిచేయాలని సూచించారు. పార్టీకి వచ్చిన ఓటమి తాత్కాలికమేనని, దీన్ని ఒక పాఠంగా తీసుకుని మరింత బలంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని చెప్పారు.

ఎన్నికల ఫలితాల విశ్లేషణలో భాగంగా డీఎంకే, టీవీకే మధ్య ఓట్ల తేడా చాలా తక్కువగా ఉందని స్టాలిన్ వెల్లడించారు. కేవలం 3.52 శాతం ఓట్ల తేడాతోనే ఈ ఓటమి ఎదురైందని చెప్పారు. ఇది పార్టీకి ఇంకా ప్రజల్లో బలమైన మద్దతు ఉందనే విషయాన్ని సూచిస్తుందని పేర్కొన్నారు. ప్రజలు తమపై నమ్మకం ఉంచారని, ప్రతి ఓటును ఆ నమ్మకానికి చిహ్నంగా భావిస్తున్నానని అన్నారు. ప్రజల సంక్షేమమే తమ రాజకీయాల కేంద్రబిందువని స్టాలిన్ స్పష్టం చేశారు. డీఎంకే అధికారంలో ఉన్నప్పుడు ప్రజల కోసం పలు సంక్షేమ పథకాలను అమలు చేసిందని, భవిష్యత్తులో కూడా అదే దిశగా పనిచేస్తుందని తెలిపారు. ఇక ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ప్రజల సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. ప్రజల డిమాండ్ల కోసం ఎప్పటికప్పుడు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని అన్నారు. ఈ ఎన్నికల్లో వ్యక్తిగతంగా కూడా స్టాలిన్‌కు ఎదురుదెబ్బ తగిలింది. కొళత్తూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ఆయన, టీవీకే అభ్యర్థి వీఎస్ బాబు చేతిలో సుమారు 9 వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు. గతంలో వరుస విజయాలను నమోదు చేసిన స్టాలిన్‌కు ఇది అనూహ్య పరిణామంగా రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన ఈసారి ఆ విజయ పరంపరను కొనసాగించలేకపోయారు. ఈ పరిణామాల నేపథ్యంలో స్టాలిన్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను గవర్నర్‌కు పంపించారు. రాజ్యాంగ పరిపాటులను పాటిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వర్గాలు తెలిపాయి. కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు మార్గం సుగమం కావడానికి ఈ చర్య తీసుకున్నట్లు సమాచారం. స్టాలిన్ రాజకీయ ప్రయాణం గురించి చెప్పుకుంటే, ఆయన దాదాపు నాలుగు దశాబ్దాలుగా రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉన్నారు. పార్టీ నిర్మాణంలో కీలక పాత్ర పోషించడమే కాకుండా, రాష్ట్ర అభివృద్ధికి పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఆయన నాయకత్వంలో డీఎంకే పలు సార్లు అధికారంలోకి వచ్చి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసింది. ప్రస్తుతం ఎదురైన ఓటమి నేపథ్యంలో పార్టీ భవిష్యత్ వ్యూహాలపై చర్చ ప్రారంభమైంది. ఎన్నికల్లో ఎదురైన లోపాలను విశ్లేషించి, వాటిని సరిదిద్దుకోవడానికి పార్టీ కసరత్తు మొదలుపెట్టింది. గ్రామీణ స్థాయి నుంచి పట్టణాల వరకు పార్టీని మరింత బలోపేతం చేయాలని నాయకత్వం భావిస్తోంది. మొత్తంగా, ఈ ఎన్నికల ఫలితాలు డీఎంకేకు ఒక పరీక్షగా మారినప్పటికీ, స్టాలిన్ ఇచ్చిన సందేశం పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపేలా ఉంది. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ, సిద్ధాంతాలకు కట్టుబడి ముందుకు సాగాలన్న ఆయన పిలుపు భవిష్యత్ రాజకీయ దిశను సూచిస్తోంది. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేయడంతో, రాబోయే రోజుల్లో డీఎంకే ఎలా పునరుద్ధరించుకుంటుందో చూడాల్సి ఉంది.

# దక్షిణాది మొత్తం మహిళలకు ఫ్రీ బస్సులే

**హైదరాబాద్ వెలుతురు మే 05**: దక్షిణాది రాష్ట్రాల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అనేది ఇప్పుడు అతిపెద్ద రాజకీయ అస్త్రంగా మారింది.కర్ణాటక(శక్తి), తెలంగాణ(మహాలక్ష్మి)ఆంధ్రప్రదేశ్ (స్త్రీ శక్తి) రాష్ట్రాల్లో ఇప్పటికే ఈ పథకాలు విజయవంతంగా అమలవుతున్నాయి. తాజాగా కేరళ అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్(UDF)'ఇందిర గ్యారెంటీ' పేరుతో, తమిళనాడులో విజయ్ (TVK) 'వెట్రి పయనం' పేరుతో ఈ ఉచిత ప్రయాణ హామీలను ఇచ్చారు.దీంతో దక్షిణాది రాష్ట్రాల్లో ఉచిత బస్సు ప్రయాణం అస్త్రంగా మారిపోయింది.









# అల్వాల్ టీమ్స్ ఆస్పత్రిని పరిశీలన

- న్యూరో సైన్సెస్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా రూపుదిద్దుకుంటున్న అల్వాల్ టిమ్స్
- ఆధునిక వైద్య సదుపాయాలపై ప్రత్యేక కార్యదర్శి సంతృప్తి






**హైదరాబాద్ వెలుతురు మే 05**: అల్వాల్ టీమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు, రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి గారి ఆదేశాల మేరకు భవనల సముదాయాన్ని రోడ్లు మరియు భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి పి. ప్రవీణ్య, ఐ.ఏ.ఎస్. గారు మంగళవారం పరిశీలించారు. ఈ పరిశీలనలో చీఫ్ ఇంజనీర్ (ఆర్ & బి) బిల్డింగ్స్ జి. రాజేశ్వర్ రెడ్డి, చీఫ్ ఇంజనీర్ (ఆర్ & బి) ఎలక్ట్రికల్ వై. లింగారెడ్డి, సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఆర్ & బి) ప్రాజెక్ట్ సర్కిల్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఆర్ & బి) ప్రాజెక్ట్ డివిజన్ 1, హైదరాబాద్‌తో పాటు ఇతర ఆర్ & బి ఇంజనీర్లు, మెడికల్ ఆఫీసర్లు, TGMSIDC అధికారులు మరియు ఎంఎస్ డీఈసీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ శ్రీ జి.వి.ఎన్. మధుసూదన్ రావు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో ఏర్పాటు చేయనున్న వైద్య సేవలు, విభాగాల ప్రణాళిక, అలాగే రోగుల నిర్ధారణ మరియు చికిత్స కోసం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న ఆధునిక పరికరాలపై చీఫ్ ఇంజనీర్ (ఆర్ & బి) బిల్డింగ్స్ జి. రాజేశ్వర్ రెడ్డి గారు వివరాలు తెలియజేశారు. టీమ్స్ అల్వాల్ ఆసుపత్రి న్యూరో సైన్సెస్‌లో అత్యుత్తమ సేవలు అందించే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా, అడ్వాన్స్‌డ్ ట్రామా కేర్, మెడికల్ టూరిజం సదుపాయాలతో పాటు (జీజీహెచ్, కుత్బుల్లాపూర్) టీచింగ్ హాస్పిటల్‌గా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అవుట్ పేషెంట్ కన్సల్టేషన్ గదులు, ఆపరేషన్ థియేటర్లు, ఐసియూ, జనరల్ వార్డులు మరియు రోగులకు అందుబాటులో ఉండే ఇతర సౌకర్యాలను ప్రత్యేక కార్యదర్శి స్వయంగా పరిశీలించారు.

మెడికల్ & హెల్త్ శాఖ, రోడ్లు మరియు భవనాల శాఖ, TGMSIDC సంయుక్తంగా చేపడుతున్న పనుల పురోగతిపై సమగ్ర సమీక్ష నిర్వహించి, సివిల్ పనులు మరియు అవసరమైన పరికరాల కొనుగోళ్లను వేగవంతం చేయాలని సూచించారు. సమావేశంలో గుర్తించిన పెండింగ్ పనులను తక్షణమే పూర్తి చేసి, విభాగాల మధ్య సమన్వయంతో మిగిలిన లోపాలను సరిచేసి ఆసుపత్రిని పూర్తిస్థాయిలో సిద్ధం చేసి, ప్రారంభోత్సవానికి రెడీ చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

# సూపర్ గుడ్ ఫిలిమ్స్ అధినేత ఆర్‌బీ చౌదరి మృతి




- ఉదయ్ పూర్ రోడ్డు ప్రమాదంలో ప్రముఖ నిర్మాత
- తెలుగు, తమిళ, మలయాళ చిత్రాల నిర్మాణం
- 99వ సినిమా 'మకుటం' నిర్మాణంలో ఉండగానే విషాదం

**హైదరాబాద్ వెలుతురు మే 05:**

ప్రముఖ సినీ నిర్మాత ఆర్‌బీ చౌదరి మృతి చిత్ర పరిశ్రమను విషాదంలో ముంచెత్తింది. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన ప్రాణాలు కోల్పోయారు. 76 ఏళ్ల వయసులో జరిగిన ఈ ఘటన సినీ వర్గాల్లో తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. సూపర్ గుడ్ ఫిలిమ్స్ బ్యానర్‌పై ఆయన తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో అనేక విజయవంతమైన చిత్రాలను నిర్మించారు. కుటుంబ ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన సినిమాలతో ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. ఆర్‌బీ చౌదరి కుటుంబానికి కూడా సినీ రంగంతో అనుబంధం ఉంది. 'రంగం' చిత్రంతో గుర్తింపు పొందిన హీరో జీవా ఆయన కుమారుడు కాగా, మరో కుమారుడు రమేశ్ 'విద్యార్థి' చిత్రంలో హీరోగా నటించారు.

రాజస్థానీ కుటుంబానికి చెందిన ఆయన 1950లో మద్రాసులో జన్మించారు. పూర్తి పేరు రతన్‌లాల్ భగత్‌రామ్ చౌదరి. సినిమాల్లోకి రాకముందు స్టీల్, జ్యువెల్లరీ వ్యాపారాల్లో కొనసాగారు. 1988లో మలయాళ చిత్రం 'ఆదిపాపమ్'తో నిర్మాతగా కెరీర్ ప్రారంభించారు. అనంతరం 1990లో 'పుదు వసంతం'తో తమిళ చిత్రసీమలో అడుగుపెట్టారు.

తెలుగులో 'నవ వసంతం'గా రీమేక్ చేసి విజయాన్ని అందుకున్నారు. 'సుస్వాగతం'తో మొదలైన ఆయన విజయ పరంపర 'సూర్యవంశం', 'రాజా', 'శీను', 'నువ్వు వస్తావని', 'నిన్నే ప్రేమిస్తా', 'ప్రియమైన నీకు', 'శివరామరాజు', 'గోరింటాకు', 'సంక్రాంతి' వంటి కుటుంబ కథా చిత్రాల వరకు కొనసాగింది. 'శుభాకాంక్షలు' వంటి హిట్ సినిమాలకు సమర్పకుడిగానూ వ్యవహరించారు. రీమేక్ సినిమాల ద్వారా టాలీవుడ్‌లో ప్రత్యేక విజయాలు సాధించిన ఆయన, కథలోని భావోద్వేగాలు అన్ని భాషల ప్రేక్షకులను ఆకట్టుకుంటాయని నమ్మకం వ్యక్తం చేసేవారు. తమిళంలో ముందుగా నిర్మించి, తెలుగు ప్రేక్షకులను మెప్పించే అంశాలు ఉంటే వాటిని రీమేక్ చేయడం తన విధానమని పలుమార్లు పేర్కొన్నారు. సూపర్‌గుడ్ ప్రొడక్షన్స్, సూపర్‌గుడ్ కంబైన్స్, మెగా సూపర్ గుడ్ ఫిల్మ్స్ వంటి బ్యానర్ల ద్వారా ఆయన సినిమాలు నిర్మించారు. గతేడాది ఆయన నిర్మాణంలో 99వ చిత్రం 'మకుటం' ప్రారంభమైంది. ఇందులో హీరోగా విశాల్ నటిస్తున్నారు. ఆర్‌బీ చౌదరి మృతితో సినీ పరిశ్రమ ఒక ప్రముఖ నిర్మాతను కోల్పోయిందని పలువురు సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

# ఏపీకి ఇక భారీగా రుణాలు



- 2026-27 ఆర్థిక సంవత్సరానికి భారీ క్రెడిట్ ప్రణాళిక ఆవిష్కరించిన చంద్రబాబు
- గతేడాది కంటే రుణ ప్రణాళికలో గణనీయమైన పెరుగుదల నమోదు
- మొత్తం రూ.5.11 లక్షల కోట్లతో ప్రాథమిక రంగాలకు సమగ్ర ప్రణాళిక సిద్ధం

**విజయవాడ వెలుతురు మే 05:**

రాష్ట్ర ప్రాథమిక రంగాల అభివృద్ధికి దిశానిర్దేశం చేసేలా 202627 ఆర్థిక సంవత్సరానికి నాబార్డు రూపొందించిన క్రెడిట్ ప్రణాళికను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆవిష్కరించారు. మొత్తం రూ.5,11,491 కోట్లతో రూపొందించిన ఈ ప్రణాళిక గత ఆర్థిక సంవత్సరంలో ఉన్న రూ.4.24 లక్షల కోట్లతో పోలిస్తే సుమారు 20 శాతం అధికంగా ఉండటం విశేషం.

ఈ ప్రణాళికలో వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇస్తూ రూ.2.55 లక్షల కోట్లు కేటాయించారు. ఇందులో భాగంగా పంట రుణాల కోసం రూ.1.66 లక్షల కోట్లు నిర్దేశించారు. రైతులకు అవసరమైన పెట్టుబడులు సకాలంలో అందించడమే లక్ష్యంగా ఈ కేటాయింపులు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. అనుబంధ రంగాల అభివృద్ధి దృష్ట్యా పశుసంవర్ధక శాఖకు రూ.34,972 కోట్లు, ఫిషరీస్‌కు రూ.21,098 కోట్లు, వ్యవసాయ యాంత్రీకరణకు రూ.8,265 కోట్లు కేటాయించారు. హార్టికల్చర్ రంగానికి రూ.11,961 కోట్లు కేటాయించగా, రాయలసీమ మరియు ప్రకాశం జిల్లాలకు ప్రత్యేకంగా రూ.5,313 కోట్లు కేటాయించడం ప్రాధాన్యం సంతరించుకుంది. వ్యవసాయ మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.9,957 కోట్లు, అనుబంధ కార్యకలాపాలకు రూ.12,687 కోట్లు కేటాయించారు. మరోవైపు చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఊతమివ్వాలనే లక్ష్యంతో ఎంఎస్ఎంఈ రంగానికి రూ.1.64 లక్షల కోట్లను కేటాయించారు. ఈ క్రెడిట్ ప్రణాళిక అమలుతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడంతో పాటు వ్యవసాయం, అనుబంధ రంగాలు, పరిశ్రమల రంగాల్లో సమగ్ర వృద్ధి సాధ్యమవుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

# మాది రైతు సంక్షేమ ప్రభుత్వం

**హనుమకొండ వెలుతురు మే05 :**

హనుమకొండలో నిర్వహించిన మెగా రైతు మేళా కార్యక్రమం రాష్ట్ర రాజకీయాల్లోనే కాకుండా వ్యవసాయ రంగంలోనూ ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రజా పాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణంలో ఈ భారీ రైతు మేళాను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతుల సంక్షేమం, ప్రభుత్వ విధానాలు వంటి అంశాలపై విశదీకరణ జరిగింది. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రైతు అనుకూల చర్యలను ప్రజలకు వివరించే వేదికగా ఇది మారింది.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రైతుల పక్షపాత ప్రభుత్వం నడుస్తోందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతు సంక్షేమాన్ని ప్రధాన అజెండాగా తీసుకుని ముందుకు సాగుతున్నామని తెలిపారు. రైతుల అభివృద్ధి లేకుండా రాష్ట్ర అభివృద్ధి సాధ్యం కాదని పేర్కొన్నారు. రుణమాఫీ అంశంపై మంత్రి గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. రైతులకు రూ.లక్ష రుణమాఫీ చేయడానికి గత ప్రభుత్వం పదేళ్ల సమయం తీసుకుందని, అది రైతుల పట్ల ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. అదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించే దిశగా అడుగులు వేస్తోందని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రాన్ని భారీ అప్పుల ఊబిలోకి నెట్టారని ఆరోపించిన మంత్రి, అయినప్పటికీ తమ ప్రభుత్వం రైతులకు రూ.21 వేల కోట్లు చెల్లించిందని వివరించారు. ఈ చెల్లింపులు రైతుల ఆర్థిక స్థితిని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషించాయని చెప్పారు. రైతులపై ఉన్న అప్పు భారాన్ని తగ్గించడమే తమ లక్ష్యమని తెలిపారు. వరి సాగుపై గత ప్రభుత్వ వైఖరిని కూడా ఆయన విమర్శించారు. అప్పట్లో వరి వేస్తే ఉరి అన్న పరిస్థితి నెలకొల్పారని వ్యాఖ్యానించారు. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు పూర్తి మద్దతు అందిస్తోందని స్పష్టం చేశారు. వరి రైతులకు కనీస మద్దతు ధర కల్పించడమే కాకుండా సన్న వడ్లకు రూ.500 బోనస్ అందిస్తున్నామని తెలిపారు. దీని వల్ల రైతులకు గణనీయమైన లాభం చేకూరుతోందని చెప్పారు. రైతుల ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను మంత్రి వివరించారు. ప్రతి ఎకరానికి రూ.12 వేల ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు. ఈ సాయం రైతులకు విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ అవసరాల కోసం ఉపయోగపడుతోందని పేర్కొన్నారు. రైతుల ఉత్పత్తి ఖర్చులు తగ్గించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. వ్యవసాయ పరికరాల పంపిణీ అంశాన్ని కూడా మంత్రి ప్రస్తావించారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించేందుకు రైతులకు పరికరాలు అందిస్తున్నామని చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయంలోకి తీసుకురావడం ద్వారా ఉత్పాదకతను పెంచడమే లక్ష్యమని తెలిపారు. రైతులు సాంకేతికతను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్‌పై కూడా మంత్రి స్పందించారు. కేంద్రం ఇచ్చే గ్రాంట్‌కు రాష్ట్రం నుంచి రూ.1200 కోట్లు చెల్లిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం ఎలాంటి రాజీ పడకుండా నిధులు వెచ్చిస్తోందని పేర్కొన్నారు. కేంద్రరాష్ట్ర సమన్వయంతో వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తున్నామని తెలిపారు. రైతులను రాజులుగా నిలబెట్టడమే తమ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. రైతు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అన్నారు.

# మోదీ సభ కోసం కేంద్ర మంత్రి వాల్ రైటింగ్

- ఈనెల 10న పరేడ్ గ్రౌండ్ సభకు రావాలంటూ పిలుపు
- జన సమీకరణపై పార్టీ నేతలతో భేటీ అయిన బండి సంజయ్, పాయల శంకర్
- సభకు వచ్చే వారికి రవాణ, నీటి సౌకర్యం కల్పించాలని జిల్లా నేతలకు ఆదేశం

**కరీంనగర్ వెలుతురు మే 05:**






ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 10న హైదరాబాద్ రానున్న నేపథ్యంలో సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహించే బహిరంగ సభకు తరలిరావాలని కోరుతూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వినూత్న రీతిలో పిలుపునిచ్చారు. మంగళవారం రోజున కరీంనగర్ చైతన్యపురిలోని తన నివాసం వద్ద గోడపై ఈ మేరకు వాల్ రైటింగ్ చేశారు. ప్రతి ఒక్క నాయకుడు, ప్రజాప్రతినిధిసహా కార్యకర్తలంతా తమ తమ డివిజన్లలో మోదీ సభ తేదీ, సమయం, ప్రాంతం తెలిసేలా వాల్ రైటింగ్ తోపాటు వినూత్న రీతిలో ప్రజలకు తెలిసేలా ప్రచారం నిర్వహించాలని కోరారు. ఆపరేషన్ సింధూర్ తరువాత మోదీ తొలిసారి హైదరాబాద్ వస్తున్నారని, ఈ నేపథ్యంలో లక్షలాది మందితో నిర్వహించే సభను కనీవినీ ఎరగని రీతిలో విజయవంతం చేయాలని బీజేపీ కార్యకర్తలపై ఉందన్నారు. రాష్ట్రంలోని ప్రతి కార్యకర్త స్వచ్ఛందంగా సభకు తరలిరావాలని కోరారు. ముఖ్యంగా కరీంనగర్ జిల్లా నుండి అత్యధిక సంఖ్యలో ప్రజలను తరలించాలని జిల్లా పార్టీ నేతలకు సూచించారు. స్వచ్ఛందంగా తరలివచ్చే వారి కోసం రవాణా, కనీస సౌకర్యాలను ఏర్పాటు చేశామని, వాటిని వినియోగించుకోవాలని కోరారు. ఈరోజు సాయంత్రం కరీంనగర్‌లో జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. బండి సంజయ్ తోపాటు ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సునీల్ రావు, పార్టీ సీనియర్ నేతలు బాస సత్యనారాయణ, డి.శంకర్, గుగ్గిళ్ల రమేశ్, రాష్ట్ర అధికార ప్రతినిధి జే.సంగప్ప, బోయినపల్లి ప్రవీణ్ రావు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈనెల 10న ప్రధానమంత్రి నరేంద్రమోదీ మోదీ సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహించే సభకు రానున్న నేపథ్యంలో బహిరంగ విజయవంతం, జన సమీకరణపై ఆయా నేతలతో పాయల శంకర్ చర్చించారు. ఈ సందర్భంగా బండి సంజయ్, పాయల శంకర్ ఏమన్నారంటే... ప్రియతమ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆపరేషన్ సింధూర్ తరువాత తొలిసారి రాష్ట్రానికి వస్తున్నారు. 3వ సారి ప్రధాని పగ్గాలు చేపట్టిన తరువాత హైదరాబాద్ తొలిసారి రాబోతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రతి బీజేపీ కార్యకర్త స్వచ్ఛందంగా తరలిరావాలి. కరీంనగర్ జిల్లా నుండి వేల సంఖ్యలో జన సమీకరణ చేద్దాం. వేలాది సంఖ్యలో ప్రజలను పరేడ్ మైదానానికి తరలిద్దాం. బీజేపీ నాయకులంతా తమ అనుచరులు, టీంతో తప్పనిసరిగా పరేడ్ మైదానానికి తరలి రావాలి. ప్రతి ఒక్కరూ మోదీ సభకు ఆహ్వానిస్తూ మీడియా, సోషల్ మీడియా ద్వారా ప్రచారం నిర్వహించాలి. మీ గ్రామాలు, వార్డులు, మండలాల పరిధిలో వాల్ రైటింగ్ రాయించండి. సభకు హాజరయ్యేందుకు సిద్ధంగా ఉన్న వారికి తగిన రవాణా, భోజన సౌకర్యాలు కల్పించాలి. మోదీ సభ సక్సెస్ తో రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బీజేపీ విజయం తథ్యమనే సంకేతాలు పంపుదాం.

# పెట్టుబడిదారుల గుండెల్లో గునపం లాంటి మహోన్నతమైన వ్యక్తి కారల్ మార్క్స

- సిపిఐ సీనియర్ నేత మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి

**హైదరాబాద్ , వెలుతురు మే 05:**



ప్రపంచ కార్మిక వర్గానికి పితామహుడు, కార్పొరేట్, పెట్టుబడిదారుల గుండెల్లో గునపం లాంటి మహోన్నతమైన వ్యక్తి కారల్ మార్క్స్ అని సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. సిపిఐ కరీంనగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో మంగళవారం బద్దం ఎల్లారెడ్డి భవన్ లో కారల్ మార్క్స్ 209వ జయంతి వేడుక జరిగింది. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, కార్యవర్గ సభ్యులు వి.ఎస్.బోస్, యూసఫ్, వాసిరెడ్డి సీతారామయ్య, పంజాల శ్రీనివాస్, ఎస్.బాల్ రాజ్ లతో కలిసి కారల్ మార్క్స్ చిత్రపటానికి వెంకటరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ కారల్ మార్క్స్ 1818 మే5 న జర్మనీలో దేశంలో జన్మించాడని, 65 సంవత్సరాలు జీవించి, 14 మార్చి 1883లో లండన్ నగరంలో మరణించారని, ఆయన తన మొత్తం జీవితాన్ని మానవజాతికి వారి అధ్యయనానికే వెచ్చించారని గుర్తు చేశారు. మానవసమాజం స్థూలంగా ఆదిమ, బానిస, డల్, పెట్టుబడిదారీ యాజమాన్య పద్ధతుల్లోకి మారే విధానాన్ని వివరించారని చెప్పారు. ఇపుడున్న పెట్టుబడిదారీ సమాజంలో ఉత్పత్తి పెరుగుదలకు ఉత్పత్తి సాధనాలు ,భూమి, యంత్రాలు వగైరా వనరుల పై ప్రయివేటు వ్యక్తుల యాజమాన్యం ఆటంకమైనపుడు సామాజిక విప్లవం ద్వారా సోషలిస్టు వ్యవస్థ దోపిడీలేని వ్యవస్థకు పరిణామం చెందటం అనివార్యమని నిరూపించాడని. మార్క్స్ గొప్పదనమంతా వివిధ దశల్లో ఈ మార్పులకు కారణాలను విశ్లేషించటం జరిగిందని అన్నారు. నేడు ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం ఎదుర్కొంటున్న ప్రతికూల పరిస్థితులు, ఆటంకాలను మనం పరిశీలించాల్సి అవసరం ఉందని, ఈ ఆటంకాలు ఇపుడే కొత్తగా ఏర్పడినవి కావనీ, ప్రపంచ శ్రామికోద్యమ చరిత్రంతా పరిశీలిస్తే అనేక సందర్భాలలో ఉద్యమం దెబ్బతినటం, తిరిగి పుంజుకోవటం, రెట్టింపు బలంతో ముందుకు సాగటం మనం గమనించాలని కార్మిక, కమ్యూనిస్టు శ్రేణులకు వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. ప్రపంచ వ్యాపితంగా కారల్ మార్క్స్ రచనల వల్ల అనేక దేశాల కార్మిక వర్గం దోపిడీ నుండి విముక్తి పొందుతున్నారని, కార్మిక లోకానికే కాకుండా ప్రజల జీవన విధానాలపై కూడా ఆయన రచనల ప్రభావం ఉందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్, జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యూసఫ్ ,వాసిరెడ్డి సీతారామయ్య, ఎస్. బాల్ రాజ్ , సీపీఐ,ఏఐటీయూసి రాష్ట్ర నాయకులు అందె స్వామి, పొనగంటి కేదారి, నరసింహ, వెంకటేష్, ప్రవీణ్, కరుణ, మణికంఠ రెడ్డి, బోయిని అశోక్ , టేకు మల్ల సమ్మయ్య, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, నాగెల్లి లక్ష్మారెడ్డి, న్యాలపట్ల రాజు, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌బీ చౌదరి మరణంపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి దిగ్భ్రాంతి


**హైదరాబాద్ వెలుతురు మే 05:**



ప్రఖ్యాత సినీ నిర్మాత, పరిశ్రమ అభివృద్ధికి విశేష కృషి చేసిన ఆర్‌బీ చౌదరి గారి మరణం పట్ల రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలుగు సహా దక్షిణ భారత సినీ పరిశ్రమకు ఆర్‌బీ చౌదరి గారు చేసిన సేవలు చిరస్మరణీయమని మంత్రి పేర్కొన్నారు. ఎంతో మందికి ఆయన ఆదర్శంగా నిలిచారని, ఆయన నిర్మించిన చిత్రాలు ప్రేక్షకుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచాయని తెలిపారు. సినీ రంగంలో కొత్త ప్రమాణాలను నెలకొల్పడంలో ఆయన పాత్ర విశేషమని అన్నారు. సినీ పరిశ్రమలో అనేక మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తూ, పరిశ్రమ అభివృద్ధికి ఆయన చేసిన కృషి అమూల్యమని మంత్రి కొనియాడారు. ఆర్‌బీ చౌదరి గారి మరణం సినీ రంగానికి తీరని లోటని తెలిపారు. ఈ విషాద సమయంలో ఆయన కుటుంబ సభ్యులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# విజయ్‌కి కాంగ్రెస్ అభయం!

**చెన్నై వెలుతురు మే 05:**




తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో సినీ నటుడు, రాజకీయ నేత విజయ్ నేతృత్వంలోని టీవీకే అనూహ్య ప్రదర్శనతో అతిపెద్ద పార్టీగా అవతరించింది. రాజకీయాల్లో తొలిసారి పూర్తి స్థాయి పోటీకి దిగినప్పటికీ, రాష్ట్రవ్యాప్తంగా పార్టీకి గణనీయమైన ప్రజాభిమానాన్ని సంపాదించగలిగింది. ఇది తమిళ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారి తీస్తుందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. మెజార్టీకి 10 సీట్లు తక్కువ అయితే ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు అవసరమైన 118 సీట్ల మెజార్టీకి టీవీకే ఇంకా 10 స్థానాలు తక్కువగా ఉండడం గమనార్హం. ఈ నేపథ్యంలో స్పష్టమైన మెజార్టీ లేకపోవడంతో రాష్ట్రంలో హంగ్ అసెంబ్లీ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ప్రభుత్వ ఏర్పాటుపై అనిశ్చితి నెలకొంది.

**కాంగ్రెస్ మద్దతు కోరిన విజయ్**

ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన మద్దతు కోసం విజయ్ ఇతర పార్టీలతో సంప్రదింపులు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే కాంగ్రెస్ పార్టీ మద్దతును కోరినట్లు ఆ పార్టీ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ వెల్లడించారు. ఈ అంశం తమిళనాడు రాజకీయాల్లో కీలక మలుపు తిరిగే సూచనలు ఇస్తోంది.

**హైకమాండ్ దృష్టికి విషయం**

విజయ్ అభ్యర్థనను కాంగ్రెస్ హైకమాండ్ దృష్టికి తీసుకెళ్లినట్లు వేణుగోపాల్ తెలిపారు. ఈ విషయంలో తుది నిర్ణయం తీసుకోవాల్సిందిగా తమిళనాడు కాంగ్రెస్ కమిటీకి ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో పరిస్థితులను అంచనా వేసి నిర్ణయం తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు.

**ప్రజల అభిప్రాయం కీలకం**

రాష్ట్ర ప్రజల మనోభావాలను దృష్టిలో ఉంచుకొని నిర్ణయం తీసుకోవాలని కాంగ్రెస్ అధిష్ఠానం సూచించినట్లు సమాచారం. టీవీకేకు మద్దతు ఇవ్వాలా లేదా అన్న అంశంపై స్థానిక నాయకత్వం అభిప్రాయం కీలకంగా మారింది. ప్రజా మద్దతు దిశగా వెళ్లేలా నిర్ణయం ఉండాలని పార్టీ భావిస్తున్నట్లు తెలుస్తోంది.

**కాంగ్రెస్ పరిమిత విజయం**

ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ డీఎంకే కూటమి తరపున పోటీ చేసి కేవలం ఐదు స్థానాల్లో మాత్రమే విజయం సాధించింది. ఇది గతంతో పోలిస్తే పరిమిత విజయంగా భావిస్తున్నారు. అయినప్పటికీ, ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ఈ ఐదు ఎమ్మెల్యేలు కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది.

**డీఎంకే కూటమికి దెబ్బ**

ఈ ఎన్నికల్లో డీఎంకే కూటమి ఆశించిన స్థాయిలో ఫలితాలు సాధించలేకపోయింది. దీని వల్ల రాష్ట్ర రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. గతంలో అధికారంలో ఉన్న కూటమి ఇప్పుడు ప్రభుత్వ ఏర్పాటులో వెనుకబడే పరిస్థితి ఎదుర్కొంటోంది. టీవీకే ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశాల నేపథ్యంలో రాష్ట్రంలో రాజకీయ చర్చలు వేడెక్కాయి. ఇతర చిన్న పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థుల మద్దతు కూడా కీలకంగా మారింది. ఈ నేపథ్యంలో వచ్చే రోజుల్లో మరిన్ని రాజకీయ పరిణామాలు చోటు చేసుకునే అవకాశం ఉంది.

**కూటమి రాజకీయాలకు ఊపిరి**

హంగ్ అసెంబ్లీ పరిస్థితులు ఏర్పడటంతో కూటమి రాజకీయాలకు మళ్లీ ప్రాధాన్యం పెరిగింది. ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీ రాకపోవడంతో, ప్రభుత్వ ఏర్పాటు పూర్తిగా పొత్తులపై ఆధారపడే పరిస్థితి నెలకొంది. ఇది రాష్ట్ర రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. టీవీకేకు కాంగ్రెస్ మద్దతు ఇస్తుందా లేదా అన్న అంశంపై త్వరలో స్పష్టత వచ్చే అవకాశముంది. ఈ నిర్ణయం ఆధారంగా తమిళనాడులో తదుపరి ప్రభుత్వం ఎవరు ఏర్పాటు చేస్తారన్నది తేలనుంది. విజయ్ రాజకీయ ప్రయాణానికి ఇది కీలక మలుపుగా భావిస్తున్నారు.



# ఇంటిపై పచ్చదనం..
## బహుళ ప్రయోజనం

కాంక్రీట్ వనంలా మారిపోతున్న పరిసరాలతో నగరంలో పచ్చదనం మచ్చుకైనా కనిపించని పరిస్థితుల్లోకి క్రమంగా వెళ్లిపోతున్నాం. ఇలాంటి తరుణంలో భవనంపై పచ్చదనం పెంపుతో అటు పర్యావరణ పరిరక్షణ, ఇటు ఆహ్లాదకర వాతావరణం సొంతం చేసుకోవచ్చు.

**స్థలం సద్వినియోగం**

టెర్రస్ గార్డెన్ అంటే ప్రకృతి అందాలను మన ఇంటి కప్పుపైనే చూసుకునే ఓ అద్భుతమైన ఆలోచన. కొద్దిపాటి స్థలం ఉన్నా.. సరైన ప్రణాళికతో మీ టెర్రస్‌ను కనువిందు చేసే తోటగా మార్చుకోవచ్చు. కేవలం అలంకరణకే కాకుండా ఆరోగ్య, పర్యావరణ, ఆర్థిక ప్రయోజనాలు సైతం ఈ ఆలోచనతో సమకూరుతాయనే చెప్పొచ్చు. భవనం పైకప్పు మీదున్న స్థలం సద్వినియోగం చేసుకుంటూ అందమైన గార్డెన్‌ను తీర్చిదిద్దుకుంటున్న వారి సంఖ్య ప్రస్తుతం అంతకంతకూ పెరుగుతోంది.

ఇలా మొదలు పెట్టాలి..

వాటర్ ప్రూఫింగ్‌తో మీ ఇంటి మీద టెర్రస్ గార్డెన్ ఏర్పాటు దిశగా అడుగులు వేయాలి. దీంతో గార్డెన్ కారణంగా వచ్చే తేమ నుంచి భవనం సురక్షితంగా ఉంటుంది. అనంతరం ప్లాస్టిక్, మట్టి కుండీలు, గ్రో బ్యాగ్స్ వీటిలో ఏది అనువైనదని భావిస్తే వాటిని ఎంపిక చేసుకోవాలి. ముఖ్యంగా తేలికగా ఉండేవి ఎంచుకోవడం మంచిది. మట్టి మిశ్రమాన్ని ఎర్ర మట్టి, కోకోపిట్, సేంద్రియ ఎరువు కలిపి సిద్ధం చేసుకోవాలి. అత్యంత కీలకమైన దశ మొక్కల ఎంపిక. మీ టెర్రస్‌పై పడే సూర్యకాంతి ఆధారంగా మొక్కలను ఎంచుకోవాలి. నీటి నిర్వహణకు డ్రిప్, స్ప్రింక్లర్ .. ఇలా నీటి ఆదా అయ్యే విధానం పాటించడం మంచిది. స్థలం తక్కువగా ఉంటే వర్టికల్ గార్డెన్ మోడల్‌లో గోడకు చిన్న కుండీలను ఫిక్స్ చేయడం ద్వారానూ ఏర్పాటు చేసుకోవచ్చు.

**ఎన్నో ప్రయోజనాలు**


ఆరోగ్యకరమైన జీవనం, రసాయనాలు లేకుండా స్వయంగా కూరగాయలు పండించుకొనే వెసులుబాటు లభిస్తుంది. రంగురంగుల పూల మొక్కలతో నచ్చిన పూలు పొందే అవకాశం ఉంటుంది. టెర్రస్ గార్డెన్ ద్వారా గాలి శుద్ధి అవుతుంది. అన్నింటికంటే ముఖ్యంగా.. ఏటేటా పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో... ఇంట్లో ఉష్ణోగ్రతను తగ్గించుకోవచ్చు. పచ్చదనంతో ఇంటి పైకప్పు చల్లగా మారి ఏసీ అవసరం తగ్గుతుంది. తద్వారా విద్యుత్ ఆదాతో ఆర్థికంగానూ ప్రయోజనం చేకూరుతుంది. మరో ప్రయోజనం... మానసిక ప్రశాంతత. మొక్కల మధ్య సమయం గడపడం మానసిక ఒత్తిడిని తగ్గిస్తుంది. వాటి మధ్య అనువైన వాకింగ్ పాత్, సిట్టింగ్ ఏరియా ఏర్పాటు చేసుకోవచ్చు. ఇలా పచ్చటి వాతావరణంతో స్వచ్ఛమైన గాలి మధ్య గడిపితే సహజ థెరపీలా పనిచేసి మీరు ఆరోగ్యంగా ఉండొచ్చు. కొన్ని మొక్కలు విక్రయించడం ద్వారా ఆదాయ మార్గంగానూ మలుచుకొనే వెసులుబాటు ఉంటుంది. ఇంతటి ఉపయుక్తమైన టెర్రస్ గార్డెన్‌ను ఇప్పటికే చాలా మంది హాబీగా మొదలు పెట్టి.. క్రమంగా విస్తరించి ఆరోగ్యకరమైన జీవనశైలిగా మార్చుకున్న ఉదాహరణలెన్నో ఉన్నాయి.

**ప్రస్తుతం నిర్మాణ ప్రణాళికలో భాగం..**

ప్రస్తుతం చిన్న నివాసం నుంచి మొదలుకొని భారీ భవనాలపైనా టెర్రస్ గార్డెన్ ఏర్పాటుకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. ఇంటి నిర్మాణ ప్రణాళికలో దీనిని భాగంగా చేసి అందుకు అనువుగా డిజైన్ అడుగుతున్నారు. మరోవైపు ఏర్పాటు చేయడంతోపాటు.., నిర్వహణ సేవలందించే వారూ అందుబాటులోకి రావడంతో, ఎలాంటి ఇబ్బందులు లేకుండా సిద్ధం చేసుకునే వీలు లభిస్తోంది. అధిక ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం కోసం సైతం టెర్రస్ గార్డెన్ సహజ సిద్ధమైన పరిష్కారంగా చెప్పొచ్చు.



# సూఖా ఆమ్ కా అచార్



**కావలసినవి:**

ఆవనూనె 200 ఎం.ఎల్,
మామిడికాయ ముక్కలు కిలో,
ఉప్పు 150 గ్రాములు,
పసుపు 2 స్పూన్లు,
కారం 5 టేబుల్‌స్పూన్లు,
సోంపు 4 టేబుల్ స్పూన్లు,
ఆవపొడి 2 టేబుల్ స్పూన్లు,
మెంతిపొడి 2 స్పూన్లు,
ఇంగువ పావు స్పూన్

**తయారీ:**

మామిడికాయలను కడిగి తడి లేకుండా తుడిచి చిన్న ముక్కలుగా కోయాలి ఉప్పు, పసుపు వేసి కలిపి మూత పెట్టాలి. రెండు రోజుల తర్వాత ముక్కలను ప్లేట్లలోకి తీసి ఎండబెట్టాలి. ఈ ముక్కల్లో కారం, సోంపు, ఆవ, మెంతి పొడులు, ఇంగువ జోడించి బాగా కలపాలి. ఆవనూనెను వేడిచేసి పూర్తిగా చల్లారాక.. ఈ మిశ్రమంలో పోయాలి. చేత్తో లేదా తడి లేని గరిటెతో ముక్కలకు నూనె పట్టేలా కలియబెట్టాలి. మూడు రోజులు ఊరిందంటే.. నోరూరించే 'సూఖా ఆమ్ కా అచార్' రెడీ. ఇది పంజాబ్‌లో ప్రసిద్ధం.



# ఇంటి తిండితో జ్ఞాపకశక్తి



బయటి తిండి కన్నా ఇంట్లో వండుకునే ఆహారం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. దీంతో మధుమేహం, ఊబకాయం, గుండెజబ్బుల వంటి సమస్యల ముప్పు తగ్గుతున్నట్టు పలు అధ్యయనాలు చెబుతున్నాయి. ఇది తీవ్ర మతిమరుపును తెచ్చిపెట్టే డిమెన్షియా బారినపడటాన్నీ తగ్గిస్తున్నట్టు తాజాగా బయటపడింది. జపాన్ జెరంటాలజీ ఎవాల్యుయేషన్ అధ్యయనంలో పాల్గొన్న 11వేల మంది వృద్ధుల ఆరోగ్య సమాచారాన్ని విశ్లేషించి మరీ ఈ విషయాన్ని గుర్తించారు. డిమెన్షియా నివారణలో జీవనశైలి మార్పులు కీలక పాత్ర పోషిస్తున్నట్టు ఫలితాలు సూచిస్తున్నాయని పరిశోధకులు పేర్కొంటున్నారు. ఆహారం, శారీరక శ్రమ వంటి జీవనశైలి అంశాలను మార్చుకోవటం ద్వారా డిమెన్షియా కేసులు సుమారు 40% వరకూ తగ్గుతున్నట్టు 2020 లాన్సెట్ కమిషన్ రిపోర్టులో వెల్లడైన విషయాన్ని ఈ సందర్భంగా ఉటంకిస్తున్నారు. ఇంతకీ ఇంటి వంట విషయ గ్రహణ సామర్థ్యం పెరగటానికి ఎలా తోడ్పడుతుంది?

ఇంట్లో వండుకోవటం ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లను ప్రోత్సహిస్తుంది. పండ్లు, కూరగాయలు ఎక్కువగా తినేలా, అతిగా శుద్ధి చేసిన పదార్థాలు తగ్గించుకునేలా చేస్తుంది.

వంట వండుకోవటానికి పడే శ్రమ కూడా ముఖ్య పాత్ర పోషిస్తుంది. పప్పులు, బియ్యం, కూరగాయల వంటివి కొనుక్కొని రావటానికి బయటకు వెళ్లినా లుగడుగులు వేయాల్సిందే. వండుకోవటానికి వాటిని సిద్ధం చేయటం.. అంటే కడగటం, తొక్క తీయటం వంటి పనులు చిన్నవైనా వృద్ధులకు ఎంతో కొంత శారీరక శ్రమను కలిగిస్తాయి.

వండటం తేలికైన పనేమీ కాదు. ఇందుకోసం మెదడు చురుకుగా పనిచేయాల్సి ఉంటుంది కూడా. ఏం వండాలి? ఏయే పదార్థాలు ఎంతెంత అవసరం? ఎంత మందికి వండాలి? అనేవి నిర్ణయించుకోవటానికి ఆలోచించక తప్పదు. ఆయా వంటకాలను చేసే తీరును తిరిగి గుర్తుకు తెచ్చుకొని, రుచికరంగా వండుకోవాల్సి ఉంటుంది కూడా. ఇవన్నీ మెదడుకు పని చెప్పేవే.



# మోదీ సభను డైవర్ట్ చేసేందుకే సీబీఐ డ్రామాలు

- ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలపై చర్చను దారి మళ్లించాలనుకుంటున్నారు
- రాష్ట్రంలో రైతులు చస్తున్నా ముఖ్యమంత్రి పట్టించుకోవడం లేదు
- నెల రోజులైనా వడ్లను కొనుగోలు చేయకుండా రైతులను అరిగోస పెడతారా?
- మండుటెండలో రైతులు పడుతున్న వెతలు కన్పించడం లేదా?
- తాలు, తరుగు సాకుతో కిలోల కొద్ది వడ్ల కటింగ్ చేస్తారా?
- కొనుగోలు టోకెన్లు ఇచ్చేందుకు కూడా దళారులు కమీషన్లు దండుకుంటుంటే ఏం చేస్తున్నారు?
- కరీంనగర్ ఖాజీపూర్ లో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన కేంద్ర మంత్రి బండి సంజయ్
- కొనుగోలు కేంద్రంలో తాము పడుతున్న వెతలను వివరిస్తూ వాపోయిన రైతులు
- 15 రోజులు దాటినా కొనుగోళ్లు చేయకుండా ఇబ్బంది పెడుతున్నారని రైతుల ఆవేదన
- యుద్ధ ప్రాతిపదికన వడ్ల కొనుగోళ్లు చేపట్టాలని కేంద్ర మంత్రి డిమాండ్
- ఫీజు రీయంబర్స్ మెంట్ కూడా చెల్లించలేని అసమర్ధ సర్కార్ కాంగ్రెస్ ది
- ఎస్టీ విద్యార్థులకు కేంద్రం ఇచ్చిన నిధులను కూడా వాడుకోలేని చేతగాని ప్రభుత్వమిది
- రూ.205 కోట్లు ఇస్తే వాడుకోలేకపోవడంతో లాప్స్ అయ్యాయని మండిపాటు
- కేసీఆర్ ను అరెస్ట్ చేసే దమ్ము రేవంత్ రెడ్డికి లేదు
- కేసీఆర్ తో బేరసారాలాడుతున్నారు
- విద్యుత్ కొనుగోళ్లపై నివేదిక వచ్చి ఏడాదిన్నర దాటినా చర్యలు తీసుకోకపోవడానికి కారణమిదే
- మా భుజంపై తుపాకి పెట్టి కాల్చాలనుకుంటున్నారు
- కేసీఆర్ ను అరెస్ట్ చేసే దమ్ము లేదని లేఖ రాస్తే కేంద్రం చూసుకుంటుంది
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఫైర్...
- కరీంనగర్ ఖాజీపూర్ వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన కేంద్ర మంత్రి
- రైతుల పడుతున్న వెతలను కళ్లారా చూసిన బండి సంజయ్
- వడ్ల కొనుగోలులో ఎదురవుతున్న ఇబ్బందులపై కేంద్ర మంత్రి ఎదుట మొరపెట్టుకున్న రైతులు

కరీంనగర్ వెలుతురు మే 05:



5 రాష్ట్రాల ఎన్నికల ఫలితాల్లో బీజేపీ సాధించిన విజయంతోపాటు ఈనెల 10న సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో జరగబోయే ప్రధానమంత్రి నరేంద్రమోదీ బహిరంగ సభపై జరుగుతున్న చర్చను దారి మళ్లించేందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీబీఐ విచారణ పేరుతో డ్రామాలాడుతున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. రాష్ట్రంలో వడ్ల కొనుగోలు కేంద్రాల్లో మండుటెండలో రైతులు అరిగోస పడుతున్నా, వడదెబ్బకు తాళలేక చచ్చిపోతున్నా రేవంత్ రెడ్డి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. తాలు, తరుగు పేరుతో పెద్ద ఎత్తున కటింగ్ చేస్తూ రైతులను దోచుకుంటున్నా, వడ్ల కొనుగోలు కోసం టోకెన్లు ఇవ్వడానికి కూడా దళారులు కమీషన్లు దండుకుంటుంటే ఈ ప్రభుత్వం ఏం చేస్తోందని దుయ్యబట్టారు. వడ్ల కొనుగోలు కేంద్రాల్లో రైతులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకునేందుకు కరీంనగర్ లోని ఖాజీపూర్ వద్ద కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. వారు పడుతున్న వెతలను కళ్లారా చూశారు. వడ్ల కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కనీస సౌకర్యాలు కూడా కల్పించని విషయాన్ని గమనించారు. ఈ సందర్భంగా రైతులంతా వడ్ల కొనుగోలు కోసం పడిగాపులు కాస్తున్నామని కేంద్ర మంత్రి వద్ద వాపోయారు. తాలు, తరుగు పేరుతో బస్తాకు నాలుగైదు కేజీలు దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కో రైతు సగటున రూ.20 వేలకుపైగా నష్టపోయే దుస్థితి నెలకొందన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చిన కేంద్ర మంత్రి అనంతరం మీడియాతో కేంద్ర మంత్రి మాట్లాడారు... ఏమన్నారంటే... రైతుల బాధలు తెలుసుకునేందుకు ఇయాళ ఖాజీపూర్ వడ్ల కొనుగోలు కేంద్రానికి వచ్చాను. రైతుల బాధలను కళ్లారా చూస్తున్నా. మండుటెండలో రోజుల తరబడి వాళ్లు వడ్లను విక్రయించేందుకు పడిగాపులు కాస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదని విమర్శంచారు. ఈ సందర్భగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి స్పందిస్తూ ''ఇంకెంతమంది రైతులను బలి కొంటారు? రైతులు చస్తున్నా వడ్లను కొనుగోలు చేయరా? కొనుగోలు కేంద్రాలవద్ద అరిగోస పడుతున్నా స్పందించరా? ప్రతి గింజకు కేంద్రమే పైసలిస్తుంటే కొనడానికి మీకున్న ఇబ్బందేమిటి? వడ్లు కొన్నందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కమీషన్ కూడా ఇస్తున్నాం కదా? వడ్ల కొనుగోలు కేంద్రాలకు వెళితే మంత్రులను రైతులు కొట్టేటట్లు ఉన్నారు. రైతులను నట్టేట ముంచారు. చేతికి పంట వచ్చేదాకా ఒక టెన్షన్... చేతికొచ్చాక అమ్ముకోవడానికి పడిగాపులు కాయాలా?. 90 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు వస్తే...ఇప్పటిదాకా 15 లక్షల మెట్రిక్ టన్నులే కొంటారా?. కొనుగోలు కేంద్రాలవద్ద టోకెన్లు ఇవ్వడానికి కూడా కమీషన్లు దండుకుంటున్న దుర్మార్గులు. తాలు, తరుగు, తేమ పేరుతో అడ్డగోలుగా దోచుకుంటున్నారు. రైతుల కష్టాన్ని దళారులు దోచుకుంటున్నా స్పందించరా? వాస్తవాలు మాట్లాడితే...మాపై ఎదురు దాడి చేస్తారా?. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేస్తోంది. ఫీజు రీయంబర్స్ మెంట్ కూడా ఇయ్యలేక ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ వర్గాల విద్యార్థుల భవిష్యత్తును దెబ్బ తీస్తారా?. కేంద్రం ఎస్టీ విద్యార్థుల రీయంబర్స్ మెంట్ కోసం నిధులు మంజూరు చేసినా వాడుకోలేని అసమర్ధ ప్రభుత్వం కాంగ్రెస్ ది. 6 గ్యారంటీలు అమలు చేయడానికి పైసల్లేవంటారు...ఉద్యోగులకు, పెన్షనర్లకు ఇవ్వడానికి నిధుల్లేవంటారు. ఢిల్లీకి కప్పం కట్టడానికి, కేరళ ఎన్నికల కోసం ఖర్చు చేయడానికి వేల కోట్లు ఇస్తారు. రైతులు చచ్చిపోతుంటే కనీసం స్పందించాలనే సోయి కూడా లేదా?. ప్రభుత్వం వెంటనే యుద్ధ ప్రాతిపదికన వడ్ల కొనుగోలును వేగవంతం చేయాలి. తాలు, తరుగు, తేమ పేరుతో కటింగ్ లేకుండా వడ్లకు కనీస ధర చెల్లించాలి. విద్యుత్ కొనుగోళ్ల అక్రమాలపై ఎంక్వైరీ కమిషన్ నివేదిక ఇచ్చి ఏడాదిన్నర దాటినా ఎందుకు చర్యలు తీసుకోలేదు?. కేసీఆర్ ను అరెస్ట్ చేసే దమ్ము మీకు లేదా? *కేసీఆర్ తో ఇన్నాళ్లు బేరసారాలాడారా?. బేరసారాలు చెడిపోయాయి కాబట్టే కేంద్రానికి లేఖ రాస్తున్నారా?. మా భుజంపై తుపాకీ పెట్టి కేసీఆర్ ను కాల్చాలనుకుంటున్నారా?. ఐదు రాష్ట్రాల ఫలితాలను డైవర్ట్ చేసేందుకే సీబీఐ డ్రామాలు. రేవంత్ రెడ్డి...మీకు కేసీఆర్ ను అరెస్ట్ చేయడం చేతగాదని ఒప్పుకుంటారా?. అదే విషయాన్ని కేంద్రానికి రాసే లేఖలో చెప్పాలి. రేవంత్ రెడ్డికి చేతగానికి ఒప్పుకుని కేంద్రానికి లేఖ రాస్తే సీబీఐ విచారణపై కేంద్రం స్పందిస్తుంది.

## యూరియా అమ్మకాలపై బ్యాన్..

## రైతు వ్యతిరేక చర్య



- రేవంత్ ప్రభుత్వం.. ముమ్మాటికి రైతు హంతక ప్రభుత్వమే
- యూరియా స్టాక్ ఉన్నా అమ్మకాలు నిలిపివేయడం దుర్మార్గం
- ధాన్యం కొనుగోళ్లు కూడా చేయలేని చేతగాని దద్దమ్మ ప్రభుత్వం ఇది
- రైతులు అరిగోస పడుతుంటే ఏం ముఖం పెట్టుకొని వారోత్సవాలు జరుపుతారు
- ఒకవైపు అమ్మకాల నిలిపివేత, మరోవైపు అడ్డగోలుగా ఎరువుల ధరలు పెంపు
- రైతు సంక్షోభం విషయంలో రెండు పార్టీలదీ ఒకే సిద్దాంతం
- మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఆగ్రహం

హైదరాబాద్ వెలుతురు మే 05: రాష్ట్ర వ్యాప్తంగా యూరియా అమ్మకాలపై బ్యాన్ విధించడం దిక్కుమాలిన చర్య అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మండిపడ్డారు. చరిత్రలో ఎన్నడూ ఇలాంటి నిషేధం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతే యూరియా అమ్మకాలపై అనధికారిక బ్యాన్ విధించారని విమర్శించారు. స్టాక్ ఉన్నప్పటికీ డీలర్లు, అగ్రో సెంటర్లు, సొసైటీల్లో రైతులకు యూరియా ఇవ్వకపోవడం రైతు వ్యతిరేక విధానాలకు నిదర్శమన్నారు. యూరియా లేక చెరకు, పండ్ల తోటలు, కూరగాయల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, యాప్ల పేరుతో మరింత ఇబ్బందులు పెంచుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎరువుల ధరలు పెరగడం, యూరియాపై బ్యాన్ కారణంగా రైతులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని, ధాన్యం కొనుగోళ్లలో విఫలం, రైతు బంధు, బోనస్, పంట బీమా, రుణమాఫీ వంటి హామీల్లో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఈ వైఫల్యాలను కప్పిపుచ్చేందుకు వారోత్సవాల పేరిట డ్రామాలు చేస్తున్నారని ఆరోపిస్తూ, వెంటనే యూరియా అమ్మకాలు పునఃప్రారంభించి బ్యాన్ ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.




Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7231/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com